విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 22 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగష్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-



# బీసీలంతా కాంగ్రెస్ వైపే

## తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు



హైదరాబాద్ /

తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన కులాలు అంతా కాంగ్రెస్ పార్టీ వైపే నిలబడాలని చట్టసభలలో అడుగుపెట్టని తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఇప్పటివరకు చట్టసభలలో అడుగుపెట్టని కులాలు బీసీలలో దాదాపు 120 దాకా ఉన్నాయని వారికి గుర్తింపు ఇవ్వటంలో అధికార బిజెపి పార్టీ ఏనాడూ కూడా కృషి చేయలేదని ఆయన ధ్వజమెత్తారు.

తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు ఉంటే అప్పటి బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు దుర్మార్గంగా 23 శాతానికి కుదించి వారి ని రాజకీయ సమాధి చేశాడని ఆయన మండిపడ్డారు. కానీ రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు పెంచి కేంద్ర ప్రభుత్వానికి పంపించినను వాటిని రాష్ట్రపతి ఆమోదింప చేయడానికి రెండు రోజులుగా ఢిల్లీలో మఖం వేసి జంతర్ మంతర్లో నిరాహార దీక్ష కార్యక్రమాలు చేస్తూ దేశ ప్రజల దృష్టిని బీసీల వైపు మల్లేటట్టు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కృషిని ఆయన కొనియాడారు. కానీ అధికార మదంతో కళ్ళు నెత్తికెక్కిన కిషన్ రెడ్డి బండి సంజయ్లు ముస్లింల గురించి బీసీల నినాదం ఎత్తుకున్నారని చెప్పి అపవాద్ మోపటం హెయమైనా చర్య అని ఆయన విమర్శించారు.

రాష్ట్రంలో బీసీలందరూ కూడా కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పూర్తి మద్దతిస్తూ అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు.బీసీలలో అత్యంత వెనుకబడిన కులాలైన ఎంబిసిలకు సంచార జాతులకు రిజర్వేషన్లు కూడా సరైన ప్రాథమిక కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఇప్పటివరకు చట్టసభలలో అడుగుపెట్టని కులాలను గుర్తించి వారికి నామినేట్ పదవులలోఅవకాశం ఇచ్చి వాళ్ళ కులాల అభివృద్ధికి పాటుపడేటట్లు కృషి చేయాలని రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తుపాకి రాముడు మాటలు మాట్లాడుతున్న కేటీఆర్ హరీష్ రావులు బీసీల అభివృద్ధికి మీ ప్రభుత్వం ఏ విధమైన కృషి చేసిందో తెలపాలని ఆయన సవాలు చేశారు. కేవలం సినిమా తరహాలో డైలాగులు కొడుతున్న కేటీఆర్ ను తెలంగాణ సమాజం ముఖ్యంగా బీసీ సమాజం పట్టించుకోదని ఆయన అన్నారు. ఏనాడు కూడా ఉద్యమాలు చేయని కేటీఆర్ ఈరోజు ప్రగల్బాల్ పలుకుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించడం కడుసోచ నీ యమని ఆయన అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ గురించి ఢిల్లీలో నిరాహార దీక్ష చేయడం యావత్ దేశాన్ని మొత్తం కదిలించిందని 29 రాష్ట్రాల్లో కూడా బీసీ నినాదం ఉవ్వెత్తున లేస్తూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి పార్టీకి తగిన గుణపాఠం చెప్పి రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మార్గం సులభం అయ్యిందని తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు జోష్యం చెప్పారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




-మిగతా

వీలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలుబడుతున్న

ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక

తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 22 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | ఆగష్టు 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-




## మాకు మా రైతు ప్రయోజనాలే ముఖ్యం

**ట్రంప్ సుంకాలపై ప్రధాని మోడీ పరోక్ష హెచ్చరిక**

- వారికి నష్టాన్ని కలిగించే విషయంలో రాజీపడబోం
- స్వామినాథన్ శతజయంతి ఉత్సవాల్లో ప్రసంగం

**న్యూఢిల్లీ,**
భారత్ తన అవసరాలు, ప్రజయోజనాల విషయంలో ఎలాంటి రాజీపడబోదని, ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఎవరి ఒత్తిళ్లకో లొంగి నడుచుకునేందుకు సిద్ధంగా లేదన్నారు. రష్యా చమురును కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై సుంకాలను రెట్టింపు చేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఇప్పటివరకు ఉన్న 25శాతం సుంకాలను 50శాతానికి పెంచుతున్నట్లు–ప్రకటించారు. ఈ పరిణామాలపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదంటూ అమెరికాను ఉద్దేశిస్తూ గట్టిగా బదులిచ్చారు.

-మిగతా 3 లో



## ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

- నామినేషన్లకు 21 చివరితేదీ..25న ఉపసంహరణ
- సెప్టెంబర్ 9న రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నిక

**న్యూఢిల్లీ**
సెప్టెంబర్ 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికకు భారత ఎన్నికల సంఘం తాజాగా గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. అధికారికంగా నామినేషన్ పక్రియను ప్రారంభించింది. నోటిఫికేషన్‌లోని వివరాల ప్రకారం నామినేషన్లు దాఖలు చేయడానికి ఆగస్టు 21 చివరి తేదీ. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేది ఆగస్టు 25గా నిర్ణయించారు. మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పార్లమెంటు- వర్షాకాల సమావేశాల మొదటిరోజే ఆకస్మికంగా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనివార్యంగా ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక జరగనుంది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ నిర్వహించే పరోక్ష ఎన్నికల ద్వారా ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు.
రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరుగుతుంది.

-మిగతా 3 లో

## బీసీ బిల్లును వెంటనే ఆమోదించండి

**బీసీలపై చిత్తశుద్ధిని నిరూపించుకోండి**



- 42శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఆర్డినెన్స్
- రాష్ట్రపతిని నేరుగా కలసి విన్నపిస్తాం
- బీజేపీ, బీఆర్ఎస్‌ల కితాబు అవసరం లేదు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, -ప్రజా స్వేచ్ఛ**
బీసీలపై ప్రేమ ఉంటే బీసీ బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మీడియాతోమాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ 42శాతం ఇవ్వాలన్నది తమ కమిట్మెంటని అన్నారు. రిజర్వేషన్ సాధనకోసం తాము చేయాల్సింది చేశామని చెప్పారు. కులగణన, రిజర్వేషన్ల సాధనలో తమ చిత్త శుద్ధిని ఎవరు శంకించలేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వంగా అన్ని విధాల పక్రియ పూర్తి చేశామన్న రేవంత్.. ప్రస్తుతం బీసీల రిజర్వేషన్ అంశం కేంద్రం పరిధిలో ఉందన్నారు. కేంద్రం, బీజేపీ కోర్టులో రిజర్వేషన్ల అంశం ఉందన్నారు. వాళ్లకు నిజంగా బీసీలపై ప్రేమ

-మిగతా 3 లో



## బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడుతాం

- కిషన్ రెడ్డి లాంటి వారి కుట్రలు సాగనివ్వం
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్

**న్యూఢిల్లీ, -ప్రజా స్వేచ్ఛ**
బీసీ రిజర్వేషన్ల కోసం తుదివరకు పోరాడతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధేయ పద్ధతిలో పోరాడి అనుకున్నది సాధిస్తామన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లాంటి వారి కుట్రలను సాగనివ్వమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా.. గెలిచిందని ఎద్దేవా చేశారు. ఉత్తరాదిలో చాలా రాష్ట్రాల్లోబీసీలు ఆ పార్టీని తిరస్కరించారని చెప్పారు. రిజర్వేషన్లు పెంచకుంటే వచ్చే ఎన్నికల్లో భాజపా ఓటమి ఖాయమని పేర్కొన్నారు. శాసనసభలో బీసీ బిల్లుపై తీర్మానం సందర్భంలో కిషన్‌రెడ్డి దానికి వ్యతిరేకంగా అభిప్రాయం చెప్పిఉంటే

-మిగతా 3 లో




## ఓట్ చోరీ

- మహారాష్ట్ర ఎన్నికల్లో 40లక్షల ఓట్లు రహస్యంగా జోడించారు
- ఎన్నికల కమిషన్‌పై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు..!

**న్యూఢిల్లీ**
కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ఎన్నికల సంఘంపై మరోసారి విమర్శలు గుప్పించారు. ఆయన మీడియా సమావేశం నిర్వహించి ఓట్ల దొంగతనం ఎలా జరిగిందో మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో 40లక్షల ఓట్లు రహస్యంగా జోడించారని ఆరోపించారు. 2024 లోక్‌సభ, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మధ్య ఈ ఓటర్లు ఓడించారన్నారు. ఇటీవల రాహుల్ గాంధీ వరుసగా ఎన్నికల కమిషన్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే.మహారాష్ట్ర, కర్నాటకతో పాటు పలు చోట్ల ఓటర్ల జాబితా ఆధారంగా చేసుకొని ఈసీపై మండిపడుతున్నారు. ఓటర్ల జాబితాలో చేర్చిన లక్షలాది ఓటర్లను ప్రస్తావిస్తూ.. ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించకుండా ఓట్లను దొంగిలిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్‌ను

-మిగతా 3 లో



## చేనేత కార్మికులకు అండగా ప్రభుత్వం

- చేనేత ఉపాధి మాత్రమే కాదు...వారసత్వ కళ
- పీపుల్స్ ప్లాజాలో చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభిచిన తుమ్మల

**హైదరాబాద్,-ప్రజా స్వేచ్ఛ**
చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్ధానంలో ఉందని, అదేవిధంగా జియో ట్యాగింగ్ లో కూడా మనమే ముందున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. చేనేత అనేది కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదు అని, భారతీయ సంస్కృతికి ప్రతీక అని అన్నారు. ఇది తరతరాలుగా వారసత్వంగా

-మిగతా 3 లో

## మనము తగ్గేదేలే అనాల్సిందే



- భారత్ ప్రతీకారం తీర్చుకోవాలి..
- అమెరికా దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించాల్సిందే
- ట్రంప్ టారిఫ్స్‌పై శశిథరూర్

**న్యూఢిల్లీ,**
భారత్‌పై ట్రంప్ 50 శాతం సుంకం విధించారు. ఆగస్టు 27 నుంచి కొత్త టారిఫ్ అమల్లోకి రానుంది. కొత్త టారిఫ్ కారణంగా పలు రంగాలు ఘోరంగా దెబ్బతినే సూచనలు కనిపిస్తున్నాయి. మొట్టమొదటిగా వస్త్రాలు, ఆటో రంగం, సముద్ర ఫుడ్‌పై తీవ్ర ప్రభావం పడనుంది. తాజాగా ట్రంప్ టారిఫ్‌పై కాంగ్రెస్ ఎంపీ శశథరూర్ స్పందించారు. ట్రంప్ విధించిన సుంకాలకు భారత్ కూడా ప్రతీకారం తీర్చుకోవాలని సూచించారు. అమెరికాతో చర్చలు ఫలించకపోతే అమెరికా దిగుమతులపై కూడా 50 శాతం సుంకాలు విధించాలని.. అప్పడే ట్రంప్ దిగొస్తారని పేర్కొన్నారు. అయినా మనపై ట్రంప్ ఎందుకు అంత కోపంగా ఉన్నారో తెలియడం లేదన్నారు.


-మిగతా 3 లో

## అందరి లెక్కలు సరిచేస్తాం

- కాంగ్రెస్ పాలనతో విసుగెత్తిన ప్రజలు
- మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారు
- పార్టీమారిన ఎమ్మెల్యేల తీరు అధ్వాన్నం
- తెలంగాణ భవన్‌లో కెటిఆర్ వెల్లడి

**హైదరాబాద్, -ప్రజా స్వేచ్ఛ**
రెండున్నరేళ్లలో బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో పరిగి నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ పాలనలో అందరికీ న్యాయం జరిగింది. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పరిస్థితి విచిత్రంగా ఉంది. భూములు విలువలు పడిపోయాయి. యూరియా కోసం రైతులు

-మిగతా 3 లో




## బీసీ బిల్లుపై పార్లమెంట్‌లో ఒత్తిడిపెంచండి

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సీఎం వినతి
- మంత్రులతో కలసి ఖర్గేతో భేటీ అయిన రేవంత్
- బీసీ బిల్లును బీజేపీ, బీఆర్ఎస్ అడ్డుకుంటున్నాయని ఆరోపణ
- బీఆర్ఎస్ శిఖండిపాత్ర పోషిస్తుందని మండిపాటు

**న్యూఢిల్లీ, -ప్రజా స్వేచ్ఛ**
బీసీ రిజర్వేషన్ల బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ఒత్తిడి పెంచాలని సిఎం రేవంత్ నేతృత్వంలోని బృందం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కోరింది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిశారు. పార్లమెంట్‌లోని రాజ్యసభ విపక్ష నేత

-మిగతా 3 లో



# పుతిన్‌తో ధావల్ భేటి..

– 'వ్యూహాత్మక భాగస్వామ్యం' ఎజెండాగా చర్చలు..!



న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ

అమెరికా సుంకాల మోత మోగిస్తున్నా భారత ప్రభుత్వం మాత్రం తగ్గేదేలే అంటోంది. రష్యాతో ముడిచమురు కొంటున్నందుకు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న ఆంక్షలు, సుంకాలను లెక్కచేయకుండా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ రష్యా పర్యటన వెళ్లారు. గురువారం ఆయన ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో భేటి అయ్యారు. మాస్కోలోని క్రెమ్లిన్ లో సమావేశం అయిన ఈ ఇద్దరూ వ్యూహాత్మక భాగస్వాములుగా ఉండడంపై ఇరువురు చర్చించే అవకాశముందని రష్యాకు చెందిన న్యూస్ ఏజెన్సీ ఆర్ఐఏ వెల్లడించింది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో పుతిన్, ధోవల్ భేటి ప్రాధాన్యం సంతరించుకుంది.రష్యా, భారత్ చమురు ఒప్పందంపై మండిపడుతున్న డొనాల్డ్ ట్రంప్ సుంకాలను పెంచుతూ పోతున్నారు. ఆగస్టు 1 నుంచి 25 శాతం టారీఫ్ విధిస్తున్నట్టు చెప్పిన ఆయన.. మరోసారి సుంకాలను 25కు పెంచారు. దాంతో.. భారత్ దిగుమతి చేసుకొనే వస్తువులపై 50 శాతం సుంకాల భారం పడనుంది. అయినా సరే అమెరికా అధ్యక్షుడి హెచ్చరికలకు భయపడేది లేదని మోడీ ప్రభుత్వం స్పష్టం చేసింది.తమకు దేశ ప్రయోజనాలే ముఖ్యమని, అంతర్జాతీయ విపణిలో ఎవరివద్దనైనా చమురు కొనే హక్కు తమకు ఉందని ట్రంప్ వ్యాఖ్యల్ని కొట్టిపారేశారు ప్రధాని. ఇదే అంశంపై రష్యా అధ్యక్షుడితో మాట్లాడేందుకు జాతీయ భద్రతా సలహారు అజిత్ ధోవల్‌ను రంగంలోపి దింపారు మోడీ.

# భారత్‌తో టారిఫ్ ఉద్రిక్తతల వేళ.. మరోసారి అమెరికాకు పాక్ ఆర్మీ చీఫ్



న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ

ప్రతీకార సుంకాల నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాషింగ్టన్‌తో పాకిస్థాన్ సంబంధాలు బలపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ మరోసారి అమెరికా పర్యటనకు వెళ్లబోతున్నారు. ఈ విషయాన్ని పాక్ మీడియా వెల్లడించింది. ఈ నెలలో సెంట్రల్ కమాండ్ జనరల్ కురిల్లా పదవీ విరమణ కార్యక్రమానికి హాజరయ్యేందుకు మునీర్ వాషింగ్టన్ వెళ్తున్నట్లు సమాచారం.కాగా, అసిం మునీర్ యూఎస్ సందర్శనకు వెళ్లడం రెండు నెలల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఈఏడాది జూన్‌లో అసిం మునీర్ అమెరికాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా ట్రంప్ వైట్ హౌస్‌లో మునీర్‌కు ప్రత్యేకంగా విందు కూడా ఇచ్చారు. భారత్‌పై అధిక సుంకాలు, పెనాల్టీలు విధించిన ట్రంప్.. పాకిస్థాన్‌తో జట్టుకట్టారు. ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. పాక్‌తో భారీ చమురు నిల్వల అభివృద్ధికి ఒప్పందం కుదిరినట్లు ప్రకటించారు. భారత్‌కు పాకిస్థాన్ ఏదో ఒక రోజు చమురు విక్రయించవచ్చని వెల్లడించారు. భాగస్వామ్యానికి నాయకత్వం వహించే చమురు కంపెనీని ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగుతున్నదని తన సామాజిక మాధ్యమం ట్రూత్ వేదికగా తెలిపారు.

# డేంజర్ మార్క్‌ను దాటిన యమునా నది ప్రవాహం..

ఆందోళనలో ఢిల్లీ వాసులు



న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ

ఢిల్లీ లో యమునా నది నీటి ప్రవాహం డేంజర్ మార్క్ ను దాటింది. గత కొన్ని రోజులుగా ఢిల్లీకి ఎగువన ఉన్న హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు యమునా నదికి వరద పోటెత్తుతోంది. పాత రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నది నీటిమట్టం 204.50 మీటర్ల ప్రమాద స్థాయిని దాటింది. గురువారం ఉదయం 8 గంటల సమయానికి నదిలో నీటి మట్టం 204.88 మీటర్లుగా ఉందని అధికారులు తెలిపారు.నదిలో నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద పరిస్థితిని ఎదుర్కొనేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హర్యానాలోని హత్నికుండ్ బ్యారేజీ నుంచి ప్రతి గంటకు పెద్ద ఎత్తున నీటిని విడుదల చేయడం వల్ల యమునా నదిలో ప్రవాహం పెరుగుతోందని అధికారులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయానికి గరిష్టంగా 61 వేల క్యూసెక్కుల నీరు యమునా నదికి వచ్చి చేరినట్లు పేర్కొన్నారు. యమునా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరడంతో ఢిల్లీ వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఓ సారి యమునా నది ప్రమాదకర స్థాయిని మించి ప్రవహించడంతో రాజధాని ప్రాంతం నీట మునిగిన విషయం తెలిసిందే.

# ఆ వ్యాధి తమిళనాడుకు పరిమితం కాదు.. దేశవ్యాప్తంగా ఉంది..!

సుప్రీంకోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు..!



న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ

ప్రస్తుత మంత్రులు, ఎమ్మెల్యేలపై ఉన్న ఏ కేసునైనా దర్యాప్తు లేకుండా ఉపసంహరించుకోకూడదని సుప్రీంకోర్టు తమిళనాడూ ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడులో ప్రస్తుత మంత్రులపై పెండింగ్‌లో ఉన్న కేసులను రాష్ట్రం వెలుపలకు బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విషయంలో అఫిడవిట్ దాఖలు చేయాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్టాలిన్ ప్రభుత్వానికి సూచించింది.తమిళనాడులో సిట్టింగ్ మంత్రులపై పెండింగ్‌లో ఉన్న కేసులను రాష్ట్రం వెలుపలకు బదిలీ చేయాలని కోరుతూ చెన్నైకి చెందిన న్యాయవాది దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్ల వాదనల ప్రకారం.. కొంతమంది రాష్ట్ర మంత్రులు, రాజకీయ నాయకులపై ప్రాసిక్యూషన్‌కు ఇచ్చిన అనుమతిని రాజకీయల కారణంగా ఏజెన్సీలు ఉపసంహరించుకున్నాయని, ప్రాసిక్యూటింగ్ ఏజెన్సీలు కూడా తీవ్ర ఒత్తిడిలో ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అమిత్ ఆనంద్ తివారీ కోర్టుకు హాజరయ్యారు. పిటిషనర్ అనవసరంగా కోర్టును ఆశ్రయించారన్నారు. అయితే, రాష్ట్రం ప్రభుత్వం పిటిషనర్‌కాకుండా కోర్టును సంతృప్తి పరచడానికి అఫిడవిట్ దాఖలు చేస్తుందని ధర్మాసనం తెలిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది డీఎస్ నాయుడు హాజరయ్యారు. దర్యాప్తు పూర్తి కాకముందే ఆమోదం ఉపసంహరించుకున్న సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. అలాంటి కేసుల్లో న్యాయ పర్యవేక్షణ కోసం ఆయన డిమాండ్ చేశారు. పిటిషనర్ సమగ్రతపై ఆరోపణల నేపథ్యంలో జస్టిస్ భుయాన్ న్యాయవాది నాయుడుతో మాట్లాడుతూ ఈ వ్యాధి తమిళనాడుకే పరిమితం కాదని.. ఇది మొత్తం దేశమంతటా ఉందని అన్నారు. కేసు విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేశారు.

# 'ప్రజలను తప్పుదోవ పట్టించకండి'..

రాహుల్ గాంధీకి ఈసీ వార్నింగ్..!





బెంగుళూర్ -ప్రజా స్వేచ్ఛ

కర్నాటకలో భారీగా నకిలీ ఓట్లతోనే బీజేపీ గెలిచిందని, ఆ పార్టీతో ఎన్నికల సంఘం కుమ్మక్కు అయిందని ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘం మండిపడింది. విపక్ష నేత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని హితవు పలికింది. ఆరోపణలు చేయడం కాదు ఆధారాలు చూపాలని.. సంతకం చేసి ఎన్నికల సంఘానికి సమర్పించాలని రాహుల్‌కు సవాల్ విసిరింది ఎన్నికల సంఘం.నకిలీ ఓట్ల విషయంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న వాఖ్యలు పూర్తిగా అబద్ధమని పేర్కొన్న ఈసీ ఆయనను ప్రమాణం చేయాలని కోరింది. 'ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాకు సంబంధించి రాహుల్‌కు ఏమైనా సందేహాలు ఉంటే ఆయన నిబంధన 20(3)(ఎ) ప్రకారం రాహుల్ తన ఆరోపణలకు ఆధారాలు చూపించాలి. అంతేకాదు సతకం చేసిన పేపర్లను ఈసీకి సమర్పించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆయనకు తన మాటలపై విశ్వాసం లేకుంటే.. అనవసరమైన వ్యాఖ్యలు చేయడం మానుకోవాలి. లేనిపోని ఆరోపణలు చేస్తూ జనాలను తప్పుదోవ పట్టించడం సరికాదు' అని ఎక్స్ వేదికగా రాహుల్‌కు తెలియజేసింది ఈసీ.గురువారం రాహుల్ గాంధీ ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024 ఎన్నికల సమయంలో మహదేవపుర నియోజవర్గంలో బీజేపీకి తొత్తుగా వ్యవహరిస్తూ అతిపెద్ద నేరానికి పాల్పడిందిన ఈసీని దుయ్యబట్టారు రాహుల్. ఆ స్థానంలో గెలిచేందుకు దాదాపు 1,00,250 నకిలీ ఓటర్లను సృష్టించారని ఆయన ఆరోపించారు. ఆ ఎన్నికలో బీజేపీ అభ్యర్థి 32,707 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

# త్వరలోనే ఇండియాకు పుతిన్

న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలోనే ఇండియాలో పర్యటించనున్నారు. ఆయన పర్యటనకు చెందిన తేదీలు దాదాపు ఖరారు అయినట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ తెలిపారు. ప్రస్తుతం ధోవల్.. మాస్కోలో ఉన్నారు. అయితే ఈనెల చివరలో ఆ భేటీ జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రష్యాతో వాణిజ్యం విషయంలో భారత్‌పై అమెరికా అదనపు సుంకం విధిస్తున్న నేపథ్యంలో మోదీ, పుతిన్ భేటీ కీలకం కానున్నది.భారత్, రష్యా మధ్య రక్షణ, భద్రతా భాగస్వామ్యం అంశాలపై ధోవల్ చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఎస్-400 సిస్టమ్స్ అంశంలో రష్యాతో ఆయన చర్చించనున్నారు. ప్రస్తుతం ఇండియా వద్ద మూడు ఎస్-400 డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. ఇటీవల



పాక్‌తో జరిగిన ఉద్రిక్తతల వేళ వాటిని వాడారు. గత ఏడాది సెప్టెంబర్‌లోనూ ధోవల్ రష్యాలో పర్యటించారు. ఆ టూరు సమయంలో ఆయన పుతిన్‌తో భేటీ అయ్యారు. మరో వైపు ట్రంప్, పుతిన్ కూడా భేటీకానున్నారు. ఆ ఇద్దరి భేటీకి వేదికను డిసైడ్ చేసినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. భేటీకి సంబంధించిన వేదిక అంశంలో రెండు దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. అమెరికా దౌత్యవేత్త స్టీవ్ విట్‌కాఫ్ ఇటీవల మాస్కోలో పర్యటించారు. ఆయన పర్యటన తర్వాత ఇద్దరు అగ్రనేతలకు చెందిన మీటింగ్‌పై అంగీకారం కుదిరినట్లు అంచనా వేస్తున్నారు. ఈ భేటీకి జెలెన్‌స్కీని కూడా ఆహ్వానించాలని అమెరికా నిర్ణయించింది. కానీ దీనిపై రష్యా స్పందించలేదు.ఈనెల చివరలో ప్రధాని మోదీ.. చైనాలో పర్యటించనున్నారు. ఆ పర్యటనకు చెందిన నిర్ణయం తీసుకున్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అవుతారు. అమెరికా అదనపు సుంకాలు విధించిన నేపథ్యంలో ఇండియా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# విదేశాంగ విధానంలో మోదీ ప్రభుత్వం ఫెయిల్

-మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదనంగా 25శాతం పన్నులు ప్రకటించారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో పన్నులు విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. దాంతో భారత్ నుంచి అమెరికా మార్కెట్‌కు వెళ్లే వస్తులపై మొత్తం 50శాతం పన్నులు విధించనున్నారు. అయితే, ట్రంప్ టారిఫ్స్‌పై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే విమర్శలు గుర్పించారు. సుంకాలు నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానం వైఫల్యంగా అభివర్ణించారు.భారత దౌత్యం బలహీనంగా, గందరగోళంగా కనిపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ చర్యలు తీసుకున్నారన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రధాని మోదీ పూర్తిగా విఫలమయ్యారని.. ట్రంప్ నిరంతరం భారత్‌పై




ఒత్తిడిని తీసుకువస్తున్నారని ఆరోపించారు. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తుండడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ట్రంప్.. భారత్ నుంచి అమెరికాకు వచ్చే అనేక ఉత్పత్తులపై అదనంగా 25శాతం సుంకాలు విధించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ 25శాతం సుంకాలు ఆగస్టు 7 నుంచి అమలులోకి వచ్చాయి. ఈ క్రమంలోనే 25శాతం అదనపు సుంకాలను ప్రకటించారు. దాంతో మొత్తం సుంకాలు 50శాతానికి చేరాయి. ఈ క్రమంలో ప్రధాని మోదీపై మల్లికార్జున్ ఖర్గే మండిపడ్డారు.అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోలేకపోయారని.. మంత్రులు నెలల నుంచి చర్చల గురించి మాట్లాడుతున్నారని.. మరికొందరు వాషింగ్టన్‌లో మకాం వేసినా ఏం జరుగలేదన్నారు. ఈ క్రమంలో పెద్ద దెబ్బ తగిలిందని.. అయినా ప్రధాని మౌనంగా ఉన్నారని మండిపడ్డారు. ఆరునెలలుగా మోదీ ప్రభుత్వం అమెరికాతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేకపోయిందని.. ట్రంప్ భారత్‌ను బెదిరిస్తూ వస్తున్నా.. మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ట్రంప్ బ్రిక్స్, వందశాతం సుంకాలపై వ్యాఖ్యానించినా ప్రధాని ఏమీ మాట్లాడలేదన్నారు. అమెరికా సుంకాల విధానంపై, ఆర్థిక పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 50శాతం సుంకాలతో దాదాపు రూ. 3.75 లక్షల కోట్ల ఆర్థిక భారం పడుతుందన్నారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, పాడి పరిశ్రమ, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఔషధాలు, పెట్రోలియం, వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ప్రభావితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రమాదానికి గురైన సీఆర్‌పీఎఫ్ జవాన్ల వాహనం..

ముగ్గురు మృతి

న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ

జమ్ముకశ్మీర్ లో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఉదంపూర్ జిల్లా కద్వా బసంత్‌గఢ్ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు వెళ్తున్న వాహనం ప్రమాదానికి గురైంది. అదుపుతప్పి లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు మృతి చెందారు. సుమారు 12 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన జవాన్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు



ఉదంపూర్ అడిషనల్ ఎస్పీ సందీప్ భట్ తెలిపారు. ప్రమాద సమయంలో వాహనంలో 23 మంది జవాన్లు ఉన్నట్లు చెప్పారు.

# మాకు మా రైతు ప్రయోజనాలే ముఖ్యం

(మొదటి తరువాయి)

దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాతో వాణిజ్యం, టారిఫ్‌ల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. రైతుల సంక్షేమమే మాకు అత్యంత ప్రాధాన్యం. రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఎన్నటికీ రాజీపడబోం. అలా చేయడం వల్ల మేం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మాకు తెలుసు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా నేను సిద్ధమే. భారత్ సిద్ధమే అని మోదీ వ్యాఖ్యానించారు. ఎం.ఎస్.స్వామినాథన్ గౌరవార్థం స్మారక నాణెం, స్టాంపును కూడా విడుదల చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు సహా భారతీయ వస్తువులపై సుంకాలను 50శాతానికి పెంచుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. భారత్‌పై ఇప్పటికే 25 శాతం సుంకాలు విధించిన ట్రంప్ తాజాగా దాన్ని 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. అంతకుముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. ఇక, కొత్తగా విధించిన అదనపు 25శాతంసుంకాలను ఈ నెల 27 నుంచి అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ టారిఫ్‌లతో భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై వెంటనే ప్రభావం పడనుంది. ముఖ్యంగా రొయ్యలు, జంతు సంబంధ ఉత్పత్తులపై అదనపు భారం పడింది. మన దేశం నుంచి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులపై సుంకాలు తగ్గించాలని అమెరికా చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. అందుకు ఆమోదిస్తే.. దేశంలోని రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నితమైన అంశం అయినందున.. వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపునకు భారత్ ససేమిరా అంది. గతంలోనూ ఈ విషయంపై ఇరు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో అగ్రరాజ్యం ఆగ్రహించినట్లు తెలుస్తోంది. మరోవైపు, రష్యా నుంచి న్యూదిల్లీ చమురు కొనుగోలును కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత్‌పై సుంకాలను రెట్టింపు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలను భయపెడుతున్న సంగతి తెలిసిందే. తన మాట వినటం లేదన్న కోపంతో ఇండియాపై ఏకంగా 50 శాతం టారిఫ్‌లు విధించారు. రష్యాతో చమురు ఒప్పందాలు క్యాన్సిల్ చేసుకోకపోతే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ భారత్ మాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలోనే డొనాల్డ్ ట్రంప్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ టారిఫ్‌ల విషయంలో ఓ క్లారిటీ- ఇచ్చారు. ట్రంప్ మతిపోయేలా సమాధానం ఇచ్చారు. మేము వెనక్కు తగ్గే అవకాశమే లేదు. మాకు రైతుల సంక్షేమమే ముఖ్యం. అదే మా ప్రధాన లక్ష్యం. రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల విషయంలో భారత్ ఎప్పుడూ వెనక్కు తగ్గదు. మాకు తెలుసు. దీని కారణంగా చాలా పెద్ద మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని. దానికి కూడా మేము సిద్ధమే. భారత్ కూడా సిద్ధమే అని మోదీ స్పష్టం చేశారు.

# నేతన్నకు భరోసా 25000

-మిగతా 3 లో

లోకేష్ సహకారంతో గతంలో ఏర్పాటైన వీవర్‌శాలను సందర్శించారు. అక్కడ చేనేత కళాకారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగించారు. చేనేతల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఈ నెల నుంచే చేనేత మగ్గాలకు 200 యూనిట్లు-, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. 'ఉచిత విద్యుత్ పథకం' ద్వారా రాష్ట్రంలో చేనేత మగ్గాలున్న 93 వేల కుటుంబాలకు, పవర్ లూమ్స్ ఉన్న 50 వేల కుటుబాలకు లబ్ది చేకూరుతుంది. దీనికోసం ప్రభుత్వం ఏడాదికి రూ.190 కోట్లు- ఖర్చు అవుతుంది. నేతన్నలకు 50 ఏళ్లకే పింఛన్ మొదలుపెట్టింది టీ-డీపీనే. 92,724 కుటు-ంబాలకు లబ్ధి కలుగుతోంది. సామాజిక పింఛన్లు రూ.4,000కు పెంచడం ద్వారా ఏడాదికి రూ.546 కోట్లు- కేవలం వీవర్స్ పెన్షన్ కోసం ఖర్చు చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు అన్నారు. చేనేత కళాకారులను చూస్తుంటే తనకు చాలా సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భారతీయ శక్తి, సంస్కృతి, సాంప్రదాయానికి శతాబ్దాల క్రితమే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత మన నేత కార్మికులదేనని ప్రసంశించారు. 'ఆరుగజాల చీర అగ్గిపెట్టె-లో పెట్టగలిగే నైపుణ్యం మన చేనేత కళాకారుల సొంతం. అన్నదాత అన్నంపెడితే... నేతన్న మనకు నాగరికత నేర్పాడు. మంగళగిరి, ధర్మవరం, వేంకటగిరి, ఉప్పాడ, పెదన, చీరాల, పొందూరు, మదనపల్లి, నందవరం, కోడుమూరు, ఎమ్మిగనూరు ఒక్కో ప్రాంతానిది ఒక్కో ప్రత్యేకత. ఆనాడు పొందూరు ఖద్దరును గాంధీజీ మెచ్చితే... పెడన కళంకారీ ప్రపంచాన్నే ఆకట్టుకుంది. బ్రిటీష్ వారు మన నేతన్నలు నేసిన ఉత్పత్తులను ఇంగ్లండ్ తీసుకు వెళ్లి అక్కడ విక్రయించేవారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఖద్దరు వస్త్రాలు ధరించడం, నూలు వడకటం దేశభక్తికి నిదర్శనం' అని సీఎం వివరించారు. గత ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేసిందని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా తనకు మొదట గుర్తొచ్చేది చేనేత కార్మికుల సంక్షేమమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో చేనేత రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిపోయింది. ఆప్కో ద్వారా చేసే ఉత్పత్తులను కొనుగోళ్లను నిలిపేశారు. 2019కి ముందు నూలు, రంగుపై ఇచ్చే సబ్సిడీని ఎత్తేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు-గా చేనేత ఉత్పత్తులపై విధించే 5 శాతం జీఎస్టీని రీయింబర్స్ చేస్తాం. దీనికి ఏడాదికి రూ.15 కోట్లను ప్రభుత్వం భరిస్తుంది. రూ.5 కోట్లతో పొదుపు నిధి ఏర్పాటు చేస్తున్నాం. 5,386 మంది చేనేత కళాకారులకు దీనితో ప్రయోజనం చేకూరుతుంది' అని ముఖ్యమంత్రి వివరించారు. ఎన్డీయే ప్రభుత్వం చేనేత కార్మికులకు అన్ని విధాలా అండగా ఉంటుందని, రాష్ట్రంలోని మాస్టర్ వీవర్లు, కళాకారులు ఉత్పత్తుల్లో రూ.1,375 కోట్ల టర్నోవర్ సాధించారని అన్నారు. అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు- చేస్తామని సీఎం ప్రకటించారు. 'చేనేత పరిశ్రమను ముందుకు తీసుకెళ్లాలనే తపన ఉన్న పారిశ్రామికవేత్త సుచిత్రా ఎల్లాను సలహాదారుగా పెట్టు-కున్నాం. వన్ ప్రొడెక్ట్, వన్ డిస్ట్రిక్ట్ కింద రాష్ట్రానికి వచ్చిన 9 అవార్డుల్లో 4 చేనేత రంగానికే వచ్చాయి. ఓఎన్‌డీసీ ద్వారా ఉత్పత్తుల మార్కెట్ విస్తరిస్తున్నాం. ఇప్పటికే 2 వేల చేనేత ఉత్పత్తులు ఓఎన్‌డీసీలో నమోదయ్యాయి. చేనేతకు చేయూతను ఇచ్చేందుకు నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ కింద 5 చోట్ల కొత్త హ్యాండ్లూమ్ క్లస్టర్లను ప్రారంభిస్తున్నాం. మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ, శ్రీకాళహస్తి, రాజాంలో రూ.74 కోట్లతో ఈ క్లస్టర్ల ఏర్పాటు- జరుగుతోంది. వీటి ద్వారా 11,374 మంది చేనేత మహిళలకు లబ్ధి కలుగుతుంది' ముఖ్యమంత్ర వివరించారు. చేనేత వర్గాల ప్రయోజనం కోసం సత్యాగ్రహం చేసిన చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్య జయంతిని ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. విజయవాడ-గుంటూరు జాతీయ రహదారిపై ఎన్నారై ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు- చేసిన చేనేత సర్కిల్లో ప్రగడ కోటయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. టీ-డీపీకి, చేనేత కార్మికులకు మధ్య అవినాభావ సంబంధం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదినే నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ సగం ధరకే చీర, ధోవతి ప్రవేశపెట్టి నేతన్నకు ఉపాధి కల్పించారని చంద్రబాబు గుర్తు చేశారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మంది ఆధారపడి జీవిస్తున్న రంగం చేనేత రంగం. దాదాపు 1,22,644 కుటు-ంబాలు ఈ రంగంలో ఉన్నాయి. అధికారంలో ఉంటే మేలు చేశాను... ప్రతిపక్షంలో ఉంటే మీ తరపున పోరాటాలు చేశాం. 2014-2019 మధ్య రూ.110 కోట్లతో చేనేత కళాకారుల రుణాలు మాఫీ చేశాం. 55,500 మంది కార్మికులకు రూ.2 లక్షల చొప్పున రూ.27 కోట్ల రుణాలిచ్చాం. 90,765 కుటు-ంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చాం. మరమగ్గాల కొనుగోలుకు 50 శాతం రాయితీ ఇచ్చి రూ.80 కోట్లు- ఖర్చు చేశాం' అని ముఖ్యమంత్రి వివరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి మంగళగిరిలో టీడీపీ ఒకసారి మాత్రమే గెలిచిందని, అందుకే ఆలోచించి పోటీ- చేసే నియోజకవర్గం ఎంపిక చేసుకోవాలని గతంలో తాను లోకేష్‌కు సూచించానని సీఎం చంద్రబాబు వఅన్నారు. అయినా లోకేష్ మంగళగిరిలోనే పోటీ-చేసి మొదటిసారి 5 వేల ఓట్ల తేడాతో ఓడిన చోటే మళ్లీ 91 వేల మెజారిటీ-తో గెలిచారని అన్నారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో 873 మంది నేతన్నల కోసం అత్యాధునిక రాట్నాలు ఇచ్చారు. వీవర్ శాల ఏర్పాటు- చేసి 20 మగ్గాలు పెట్టారు. 3 వేల కుటు-ంబాలకు బట్టలు పెట్టి పట్టాలు అందించారంటే అదీ పేదల పట్ల, చేనేతల పట్ల లోకేష్ చిత్తశుద్ధికి నిదర్శనం. పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్‌గా నందం అబద్దయ్య, డైరెక్టర్‌గా కందుల నాగార్జున, టీ-టీ-డీ బోర్డ్ మెంబర్‌గా తమ్మిశెట్టి జానకిదేవి, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా జనసేన నుంచి చిల్లపల్లి శ్రీనివాస్‌ను నియమించాం' అని అన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి వెనుకబడిన వర్గాలు తోడుగా ఉన్నాయి. బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే... గత ప్రభుత్వం దాన్ని 24 శాతానికి తగ్గించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడే బిసిల కోసం ఆదారణ పథకాన్ని తెచ్చాం. 2014 తరువాత ఆదరణ 2 ద్వారా రూ.964 కోట్లు- పనిముట్లు- కోసం ఖర్చు పెట్టాం. త్వరలో ఆదరణ పథకం-3 తీసుకొస్తాం. బలహీన వర్గాలకు కూటమి ప్రభుత్వం ఎప్పుడూ బాసటగా నిలుస్తుంది. బీసీల సంక్షేమానికి రూ.47,456 కోట్లు- బడ్జెట్‌లో కేటాయించాం. దేవాలయాల్లో పనిచేసే నాయిబ్రాహ్మణుల వేతనాలు రూ.25 వేలకు పెంచాం. సెలూన్‌లకు నెలకు 200

యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తాం. 40 వేల నాయిబ్రాహ్మణ కుటుంబాలకు లబ్ది కలుగుతుంది. గీత కార్మికులకు 10 శాతం మద్యం షాపులు కేటాయించాం. బార్లలోనూ 10 శాతం రిజర్వేషన్లు కేటాయించాం. మత్స్యకారులసేవలో పథకం ద్వారా రూ.20 వేల ఆర్థికసాయం అందించాం. వడ్డెరల కోసం 10 శాతం క్వారీలు కేటాయిస్తాం. యాదవుల కోసం పాడి పరిశ్రమలో ప్రోత్సాహం అందిస్తాం. సోలార్ విద్యుత్ ఉత్పత్తి పథకంలో బీసీలకు 3 కిలోవాట్లకు రూ.98 వేలు సబ్సిడీ ఇస్తున్నాం. రాబోయే నాలుగేళ్లలో రూ.2 లక్షల కోట్లు- బీసీలకు ఖర్చుచేస్తాం. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు వచ్చేవరకూ పోరాడతాం' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వం నాడు అడుగడుగునా బీసీలను అణగదొక్కిందని, అయినా ఆ ప్రభుత్వ బెదిరింపులకు బీసీలు ఏమాత్రం బెదరలేదని ముఖ్యమంత్రి అన్నారు. ప్రొద్దుటూరులో చేనేత వర్గానికి చెందిన నందం సుబ్బయ్యను, పల్నాడులో తోట చంద్రయ్యను కిరాతకంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ దుర్మార్గాలకు భయపడని బీసీల కోసం నా చివరి శ్వాస వరకు పనిచేస్తా. రాష్ట్ర టీ-డీపీ అధ్యక్ష పదవి, స్పీకర్ పదవి సహా పలు కీలక శాఖల మంత్రి పదవులను బీసీలకే ఇచ్చాం.' అని సీఎం అన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక చేనేతలు

-మిగతా 3 లో

అందుకే 50 ఏళ్లకే పింఛన్ తీసుకొచ్చాం అన్నారు. 50శాతం సబ్సిడీతో మర మగ్గాలకు రూ.80కోట్లు- ఖర్చు పెట్టాం. ఈ నెల నుంచే 200యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని హామీ ఇస్తున్నాం. మరమగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తాం. ఉచిత విద్యుత్ వల్ల 93 వేల కుటుంబాలకు లబ్ధి కలుగుతుంది. చేనేతలకు ఎంత ఇచ్చినా తక్కువే అవుతుందని చంద్రబాబు అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి ఆటోనగర్ లోని వీవర్ శాల వద్ద నిర్వహించిన 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబుతో కలిసి మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా వీవర్ శాలలో ఏర్పాటు- చేసిన చేనేత ఉత్పత్తుల స్టాళ్లను, వీవర్ శాలలో మగ్గాలు, చేనేత వస్త్రాలను మంత్రి పరిశీలించారు.



అనంతరం ఏర్పాటు-చేసిన సభలో 'జై చేనేత' అంటూ మంత్రి నారా లోకేష్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. మంగళగిరి నియోజకవర్గంలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నా. అందరూ చేనేతలను కార్మికులని అంటారు. కానీ చేనేత కార్మికులు పడుతున్న కష్టాలు నేను నేరుగా చూశాను. దారానికి రంగు దగ్గర నుంచి మగ్గాలపై చీర నేసే వరకు అహర్నిశలు శ్రమిస్తారు. అద్భుతమైన డిజైన్స్ రూపొందిస్తారు. అందుకే నేతన్నలందరినీ నేను చేనేత కళాకారులని ఈ సందర్భంగా పిలుస్తున్నాను. 2019లో 21 రోజుల ముందు టీడీపీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చా. 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయాను. కానీ మంగళగిరి పట్టణం నాకు ఆనాడు 7వేల మెజార్టీ ఇచ్చింది. ఆనాడే నిర్ణయించాను.. చేనేత సోదరులు నా సొంత కుటుంబ సభ్యులని. ఓడిపోయిన మొదటి రోజు బాధ, ఆవేదన కలిగింది. రెండో రోజు నుంచి ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ఐదేళ్లు ఇక్కడే పనిచేసి ప్రజలకు దగ్గర కావాలని నిర్ణయించుకున్నానని అన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ మంగళగిరి నియోజకవర్గ ప్రజల కోసం 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. మంగళగిరిలో పద్మశాలీ సోదరులకు రెండు కులవృత్తులు ఉంటాయి. ఒకటి చేనేత, రెండోది స్వర్ణకార వృత్తి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేనేత సోదరులను ప్రోత్సహించేందుకు 873 రాట్నాలు ఆనాడు ఉచితంగా అందించాం. కరోనా సమయంలో చేనేతలకు కావాల్సిన మందులు, ఆక్సిజన్ సిలిండర్లు అందించాం.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

-మిగతా 3 లో

ఎలక్టోరల్ కాలేజీ సభ్యులు ఏ పార్టీ విప్‌కి కట్టుబడి ఉండనవసరం లేదు. ఉపరాష్ట్రపతిని పార్లమెంటు- సభ్యులు ఎన్నుకుంటారు. ఈ కారణంగా ఎన్‌డీఏ తన అభ్యర్థిని సులభంగా ఎన్నుకోగలదు. రెండు సభల ప్రస్తుత బలం 786. అభ్యర్థి గెలవడానికి 394 ఓట్లు- అవసరం. ఎన్‌డీఏకు లోక్‌సభలో 293 మంది ఎంపీలు, రాజ్యసభలో 129 మంది ఎంపీలు ఉన్నారు మొత్తం ఓట్ల బలం 422. ఇది ఉపరాష్ట్రపతి ఎన్నికకు అవసరమైన సంఖ్య కంటే అధికం.

## ఓట్ చోరీ

-మిగతా 3 లో

దోషిగా పేర్కొంటూ.. ఈసీ విశ్వసనీయత సందేహాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సేకరించిన ఆధారాలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ.. బీజేపీ ఓట్లను దొంగిలిస్తుందన్నారు. ఓటర్ల జాబితా అంశంపై ఈసీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మహారాష్ట్రలో కొన్ని నెలల్లోనే లక్షలాది మంది ఓటర్ల పేర్లు జాబితాలో చేర్చారని.. ఇది చాలా ఆందోళనకరమైన విషయమన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత ఓటర్ల సంఖ్య పెరగడం కూడా ఆశ్చర్యకరమైన విషయమన్నారు. ఓట్ల దొంగతనానికి సంబంధిం సాక్ష్యాలను సేకరించేందుకు ఆరు నెలలు పట్టిందన్నారు. ఈ సందర్భంగా ఈసీకి ఆయన పలు ప్రశ్నలు సంధించారు. సాయంత్రం 5గంటల తర్వాత ఓటింగ్ ఎందుకు పెరిగింది ? ఎన్నికల కమిషన్ దీనికి సమాధానం చెప్పాలి లన్నారు. ఓట్ల దొంగతనానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నలు అడిగిందని, ఇప్పటి వరకు ఒక్క సమాధానం ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా 2024 నవంబర్‌లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ.. ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత, అసెంబ్లీ ఎన్నికలు 'రిగ్గింగ్' అయ్యాయని మా అనుమానాలు నిజమయ్యాయన్నారు.

## మనమూ తగ్గేదేలే అనాల్సిందే

-మిగతా 3 లో

చైనాకు 90 రోజులు గడువు ఇచ్చారని.. మనకు మాత్రం 21 రోజులు మాత్రమే ఇచ్చారని గుర్తుచేశారు. మనం కూడా 50 శాతం సుంకం విధిస్తేనే దారిలోకి వస్తారని పేర్కొన్నారు. భారతదేశం ప్రస్తుతం అమెరికా దిగుమతులపై 17 శాతం సుంకాలను విధిస్తోందని.. దానిని 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. మీరు చేస్తే.. మేము చేస్తామన్న ధోరణిలో బెదిరించాలన్నారు. రష్యా దగ్గర చమురు తక్కువగా దొరుకుతుంది కాబట్టే భారత్ కొనుగోలు చేస్తుందని చెప్పుకొచ్చారు. ఏ దేశమైనా అదే పని చేస్తుందన్నారు. ఏ ప్రభుత్వమైనా అన్నదాతలకు నష్టం కలిగించే చర్యలకు పూనుకో కూడదని శశిథరూర్ సూచించారు. భారత్‌పై ట్రంప్ తొలుత 25 శాతం సుంకం విధించారు. అనంతరం రష్యాతో సంబంధం పెట్టు-కున్నందుకు జరిమానాగా మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు- ట్రంప్ హెచ్చరించారు. ఆగస్టు 27 నుంచి అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అయితే దీన్ని అన్యాయంగా విదేశాంగ శాఖ పేర్కొంది. ఇదిలా ఉంటే అమెరికా బృందం ఈనెలలో భారత్‌లో పర్యటించనుంది. అప్పుడైనా అమెరికాలో మార్పు వస్తుందేమో చూడాలి.

## కళాకారుల సృజనాత్మకతకు ఆలంబన..చేనేత

-మిగతా 3 లో

మర మగ్గాలకు 500 యూనిట్లు- వరకూ ఉచిత విద్యుత్తు అందిస్తుంది. సొసైటీలనుచి ఆప్కో కొనేవాటికి జీఎస్టీపై 5శాతంరాయితీ అమలు చేయడంతోపాటు- త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు-కు నిర్ణయం తీసుకోవడమైందని అన్నారు. ?చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటు-ంది. చేనేత వస్త్రాలు వినియోగం పెంచే దిశగా ప్రచార కార్యక్రమాలు పెంపొందిస్తాము. యువత వారానికి ఒకసారి చేనేత వస్త్రాలను ధరిస్తే ఆ రంగంపై ఆధారపడ్డవారికి ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని పవన్ సూచించారు.

## పేదలకు మెరుగైన వైద్యం

-మిగతా 3 లో

గాను, రూ,3,87,505.లక్షల, ఆగిరిపల్లి మండలంలో 12 మంది బాధిత కుటు-ంబాలకు, రూ,8,00147.లక్షల, ముసునూరు మండలంలో 11 మంది బాధిత కుటుంబాలకు రూ,7,19,545.లక్షల. చాట్రాయి మండలంలో 4 కుటు-ంబాలకు, రూ,3,50,061.లక్షల, ఇతర ప్రాంత వాసుల 3 కుటు-ంబాలకు, రూ,1,58,134.లక్షల విలువైన చెక్కులను,బాధిత కుటు-ంబాలకు అందజేసిన మంత్రివర్యులు. పలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఇటీ-వల వైద్యం చేయించుకొని ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జి పెట్టు-కున్న 49మంది కుటుంబాలకు సుమారు, రూ:31లక్షల చెక్కులను బాధిత కుటుంభాలకు అందించారు. నియోజకవర్గానికి చెందిన పలువురు వైద్యం చేయించుకొని బిల్లులను ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ చేసుకోగా నేడు బాధితులకు చెక్కులను అందజేశారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు కూడా వైద్యం చేయించుకున్న బిల్లులను మా కార్యాలయంలో అందజేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సహాయం వెంటనే అందజేస్తానన్నారు. మెరుగైన వైద్యానికి కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని ప్రజలంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని ప్రజలంతా మెరుగైన వైద్యాన్ని సద్వినియోగం చెసుకోవలన్నారు. రాష్ట్ర మంత్రి పార్థసారథికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న మా కుటుంబాన్ని దేవుడి లా ఆదుకొన్నారని ఇలాంటి మంత్రి కి జీవితాంతం రుణపడి ఉంటామని, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు, కుటుంబ సభ్యులు తమ హర్షాన్ని కృతజ్ఞతను తెలియజేసారు,ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై నూలును అందించాలి

-మిగతా 3 లో

లక్షల మగ్గాలు ఉంటే కేవలం 62 వేల మగ్గాలకు ఉచిత విద్యుత్ ఇచ్చి చేతులు దులుపుకోవడం దుర్మార్గమన్నారు. గత ఎన్నికల్లో చేనేతలకు ఇచ్చిన 25 హామీలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసి, చేనేత సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. చేనేతల సంక్షేమానికి 5 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పిన ప్రధాని మోడి ముష్టి రూ.200 కోట్లు మాత్రమే ఇవ్వడం దారుణమని తెలిపారు. చేనేతలకు సబ్సిడీ కింద బకాయి పడిన రూ.152 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి చేనేతకు హెల్త్ కార్డు అందించాలని, భీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

## సంపాదకీయం

# స్వామినాథన్ సూచనలకు విలువేదీ?

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ శతజయంతి జరుపుకుంటున్న వేళ ఆయన సూచించిన అనేక విషయాలను మననం చేసుకుని,వాటిని అనుసరించాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.దేశంలో వ్యవసాయం గుడ్డెద్దు చేల్లో పడ్డ చందంగా మారింది. విపరీతమైన రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతోంది. మనుషుల్లో రోగాలకు కారణం అవుతోంది. ఎరువులన్నీ మనుషుల్లో నిక్షిప్తం అయి కొత్త రోగాలను కొని తెచ్చుకుంటున్నాం. క్యాన్సర్ లాంటి వ్యాధులను ఆహ్వానిస్తున్నాం. ఈ క్రమంలో వ్యవసాయాన్ని సేంద్రియం వైపు మళ్లించాలి. అలాగే రైతులకు అసవరమైన సేంద్రియ పద్ధతులను అందుబాటులోకి తీసుకుని రావాలి. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు హామీ ఇవ్వాలి. ప్రజలకు ఆహార ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకుని రావాలి. సేంద్రియ ఉత్పత్తులను విదేశాలకు విరివిగా ఎగుమతి చేసుకునేలా చేయాలి. ఇందుకు పాలకులు ప్రతినబూని పనులు చేపట్టాలి. వ్యవసాయాన్ని పండగ చేయాలంటే ఇవి మాత్రమే చేయాలి. అంతేగానీ కబుర్లు చెప్పడం మానాలి. దేశ ఆహార భద్రతకు కీలకమైన, వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రొఫెసర్ స్వామినాథన్ ఒకరు. స్వామినాథన్‌ను హరిత విప్లవ పితామహుడిగా పిలుస్తున్నాం. కాని ఆయన తరచుగా వ్యవసాయ రంగం అభివృద్ధికి, రైతుల అభివృద్ధికి సూచించిన సలహాలను విస్మిరస్తూ వచ్చాం. జాతీయ రైతు కమిషన్ చైర్మన్‌గా స్వామినాథన్ ప్రభుత్వాల ముందుంచిన నివేదికలు చాలా విలువైనవి. వాటిని అమలు చేస్తామని అంటున్న పాలకులు వాటి జోలికి పోవడం లేదు. ఊకదంపుడు ఉపన్యాసాలు, రుణమాఫీలు,రైతుబంధు వంటి పథకాలతో మభ్యపెడు తున్నారు. ఆయన 2005-2006 సంవత్సరాల్లో ప్రభుత్వం ముందుంచిన సమగ్ర జాతీయ రైతు కమిషన్ నివేదికలు పాలకుల పక్షపాత వైఖరిని బహిర్గతం చేశాయి. అనేకమంది రైతులు తమ ఆందోళనలో తరచూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని కోరుతున్నారు. విచ్చలవిడి రసాయనాల వాడకం, యంత్రాల వినియోగం వలన జరుగుతున్న నష్టాల్ని 1968 సైన్స్ కాంగ్రెస్ స్థాయిలోనే వివరించారు. స్వామినాథన్ రాజ్యసభ సభ్యుడిగా మహిళా రైతుల హక్కుల గురించి, పటిష్ట వ్యవసాయ రంగ అభివృద్ధి గురించి, సమగ్ర భూ, రైతు రక్షణ అంశాలతో ముడిపడిన సంస్కరణల విషయాల్ని ప్రస్తావించారు. మహిళా రైతులకు భూ వనరు, ప్రభుత్వ పథకాల విస్తరణకు తగిన చట్టాల్ని ప్రవేశ పెట్టిన ఘనత స్వామినాథన్‌ది. వ్యవసాయ సాంకేతికాల విస్తరణ, ఉత్పత్తి పరంగా ప్రభుత్వ పాత్ర పెరగాలని, ప్రభుత్వేతర సంస్థల ద్వారా రైతులకివ్వబడే సాంకేతికాల పరంగా, నియంత్రణ జరగాలని చట్ట సభలో వ్యక్తపరిచారు. ముఖ్యంగా కృత్రిమ జన్యు మార్పిడి ద్వారా జరిగిన సాంకేతికాల్ని విశ్లేషించి, పరిశోధించకుండా విస్తరింప చేయ కూడదని చెప్పారు. స్వామినాథన్ తన 98 ఏళ్ల జీవితంలో అనేక వైవిధ్యమైన విజయాలను అందుకున్నారు. అదే సమయంలో అసంబద్ధ విమర్శలనూ ఎదుర్కొన్నారు. స్వామినాథన్ దేశ ముఖ్య ఆహార పంటలైన గోధుమ, వరి వంటి వ్యవసాయాల్ని మలుపు తిప్పారు. స్వామినాథన్ తన కుటుంబ నేపథ్యమైన వైద్య వృత్తిని చేపట్టకుండా కీలకమైన వ్యవసాయ రంగాన్ని ఎన్నుకోవటమే దేశీయ వ్యవసాయంపై ఆయనకున్న ఆసక్తిని గుర్తించాలి. వ్యవసాయ-జన్యు శాస్త్రవేత్తగా నైపుణ్యత పొందటమే గాకుండా దేశీయ వ్యవసాయానికి విలువైన సూచనలు చేశారు. ప్రఖ్యాత విదేశీ సంస్థల్లో, గుర్తింపు పొందిన శాస్త్రవేత్తల నేతృత్వంలో ఐరోపాలో పని చేసి, అక్కడే ఉండకుండా భారతదేశం రావటమే స్వామినాథన్ దేశభక్తికి నిదర్శనం. ఆయన దేశ ఉన్నత వ్యవసాయ పరిశోధనా మండలి నిర్దేశకుడిగా ఎదగటం విలువైన విషయం. కేంద్ర ప్రభుత్వ ముఖ్య వ్యవసాయ సలహాదారుగా ప్రముఖ పాత్ర వహించారు. దేశ ఆహార భద్రతకు కీలకమైన గోధుమ పంట సాగును మలుపు తిప్పేందుకు కృషి చేసి ఎందరో శాస్త్రవేత్తల్ని, విద్యావేత్తల్ని తయారుచేశారు. సమాంతరంగా ఆసియా దేశాల మూల వరి వంగడాల ప్రభావాలతో మార్చబడిన వారి వ్యవసాయాన్ని మలుపు తిప్పారు. ఫలితంగా 1980-85 నాటికి దేశంలో తిండిగింజల ఉత్పత్తి ఐదు రెట్లు పెరిగింది. సమాంతరంగా వివిధ ఆహార పంటలు, వ్యవసాయ ఉప వృత్తుల ఉన్నతికి తగిన మానవ వనరును రూపొందించగలిగిన సంస్థలెన్నో ఏర్పడ్డాయి. అనేక ఆసియా, ఆఫ్రికా దేశాల వ్యవసాయ పరిశోధనారంగ ప్రగతికి తోడ్పడ్డారు. చైనా, వియత్నాం, ఆఫ్ఘనిస్థాన్, మయన్మార్ వంటి దేశాల పరిశోధనా రంగ ప్రగతికి తోడ్పాటునిచ్చారు. చైనా నెలకొల్పిన వ్యవసాయ వ్యవస్థ ప్రత్యేకతను గుర్తించారు. స్వామినాథన్‌ను అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. అలానే, అనేక సంస్థలు, వ్యక్తులు పురస్కాలిచ్చారు. ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి ద్వారా ఆయన మొదటి 'ప్రపంచ ఆహార పురస్కారం' పొందటం విశేషం. మరణానంతరం భారత రత్న కూడా ఇచ్చారు. భారతదేశం హరిత విప్లవ వరవడిలో నష్టపోయిన, స్థానిక చిరుధాన్య పంటల అభివృద్ధికి తన సంస్థ ద్వారా కృషి సల్పారు. అలానే వ్యవసాయ అనుబంధ వృత్తిగా ఉన్న మత్స్యకారులు అభివృద్ధికి తగిన పథకాలను రూపొందించి దక్షిణ భారతదేశ తీర ప్రాంతంలో పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు నిర్వహించారు. మడ అడవుల్ని రక్షించి జలజీవాల మనుగడను కాపాడే పథకాలను అమలు చేశారు. ఆహార భద్రత పథకాల అమలు విషయంలో ప్రభుత్వాల ఆచరణ అంశాలను విశ్లేషించగల శాఖల్ని నిర్వహించారు. జీవిత చివరి దశలో జాతీయ రైతు కమిషన్ బాధ్యుడిగా, భారతదేశ రైతులకు తగిన సంస్కరణలను ముఖ్యంగా ఆదివాసీలకు, చిన్న సన్నకారు వృత్తిదారుల అభివృద్ధికి తగిన విధంగా సూచనలివ్వటం గర్వించదగిన విషయమని చెప్పుకొన్నారు. అఖిల భారత కిసాన్ సభ నాయకులతో కలిసి, తను ఆశించిన ప్రభుత్వాల వైఖరిలో రావాల్సిన మార్పుల్ని వ్యక్తపరిచారు. పరోక్షంగా భూసారం, పర్యావరణం కాపాడబడాలంటే, దున్నే వారికే భూమి, సాగునీటి వనరు ఉండాలని వివరించారు. పంట భూములు వ్యవసాయేతర రంగాలకు, సంస్థలకు మరల్చకూడదని సూచించారు. వ్యవసాయ రక్షణకు ప్రత్యేక వ్యవస్థాయ మండళ్లను రూపొందించాలని సూచించారు. ఇవన్నీ ఎంతో విలువైన సమాచార భాండాగారంగా గుర్తించి అమలు చేయాలి. దేశీయ వ్యవసాయాన్ని పరుగులు పెట్టించి, రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, ప్రజలకు ఆహారధాన్యాలను అందించడమే స్వామినాథన్‌కు మనమిచ్చే నిజమైనా నివాళి అని గుర్తించాలి.

# రష్యా లగ్జరీ షిప్‌ను వేలం వేయనున్న అమెరికా..

**-సూపర్ యాచ్ ఖరీదు 325 మిలియన్ డాలర్లు..!**

**న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ**

అగ్రరాజ్యం అమెరికా 325 మిలియన్ల విలువ లగ్జరీ సూపర్‌యాచ్ అయాడియా షిప్‌ను వేలం వేయబోతున్నది. ఈ నౌక రష్యాకు చెందింది కావడం విశేషం. ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత అమెరికా దీన్న స్వాధీనం చేసుకున్నది. ఈ వేలం సెప్టెంబర్ 10 వరకు కొనసాగనున్నది. ఉక్రెయిన్‌పై యుద్ధానికి ముగింపు పలకాలానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై ఒత్తిడి తీసుకువస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మిత్రదేశాలతో పాటు రష్యాలోని ధనవంతులపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు అమెరికా తెలిపింది. ఇందులో కొందరు పుతిన్‌కు దగ్గరగా ఉన్న వ్యక్తులు ఉన్నారు. యుద్ధాన్ని ఆపాలని పుతిన్‌పై ఒత్తిడి తీసుకురావాలని అమెరికా కోరుతోంది. రష్యన్ సూపర్‌యాచ్ట్ అమడియాను మూడేళ్ల క్రితం అమెరికా స్వాధీనం చేసుకుంది. ఈ యాచ్ ప్రస్తుతం శాన్ డియాగోలో ఉన్నది. ఇది 348 అడుగుల పొడవు ఉంటుంది. ఈ యాచ్‌ను ప్రత్యేకంగా 2017లో జర్మన్



కంపెనీ లర్సెన్ నిర్మించింది. ఈ సూపర్‌యాచ్ట్‌ను ఫ్రాంకోయిస్ జురెట్టి రూపొందించారు. లోపలి భాగాన్ని పాలరాయితో తీర్చిదిద్దారు. ఈ యాచ్‌లో ఎనిమిది స్టేట్ రూమ్‌లు, ఒక బ్యూటీ సెలూన్, ఒక స్పా, జిమ్, ఒక హెలిప్యాడ్, ఒక స్విమ్మింగ్ పూల్, ఒక లిఫ్ట్ ఉంటుంది. ఇందులో 16 మంది అతిథులు, 36 మంది సిబ్బందికి వసతి ఉంటుంది. అమెరికా స్వాధీనం చేసుకున్న అమాడియా వాస్తవ యజమాని ఎవరో ఇప్పటి వరకు స్పష్టంగా తెలియదు. ఇది కేమన్ దీవుల్లో ఉన్న మిల్ మారిన్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ పేరుతో రిజిస్టర్ అయ్యింది. ఈ యాచ్ నిజమైన యజమాని ఆర్థికవేత్త, మాజీ రష్యన్ రాజకీయ నాయకుడు సులేమాన్ కెరిమోవ్ అని అమెరికా చెబుతూ వస్తున్నది. ఆయన 2018 నుంచి యూఎస్ ఆంక్షలను ఎదుర్కొంటున్నారు. కానీ, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న రష్యన్ చమురు, గ్యాస్ కంపెనీ రోస్‌నెఫ్ట్ మాజీ అధ్యక్షుడు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎడ్వర్డ్ ఖుదైనాటోవ్ ఈ యాచ్ యజమానిగా చెప్పుకుంటున్నారు. యాచ్ స్వాధీనంపై ఖుదైనాటోవ్ కోర్టులో అప్పీల్ చేస్తున్నారు. యాచ్ నిజమైన యజమాని కెరిమోవ్ పేరును దాచడమే దీని లక్ష్యమని యూఎస్ ప్రాసిక్యూటర్లు చెబుతున్నారు. ఈ యాచ్ స్వాధీనంపై ఖుదైనాటోవ్ కోర్టులో అప్పీల్ చేయనుండగా.. వేలం ఏమాత్రం సరికాదని.. చట్టపరంగా సవాల్ చేస్తామని ఆయన తరఫు న్యాయవాది న్యాయవాది ఆడమ్ ఫోర్డ్ పేర్కొంటున్నారు.

# జస్టిస్ యశ్వంత్ వర్మకు షాక్..

**-పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు..!**

**న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ**

జస్టిస్ యశ్వంత్ వర్మకు సర్వోన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను గురువారం తిరస్కరించింది. త్రిసభ్య విచారణ కమిటీ దర్యాప్తు నివేదికను సవాల్ చేసిన జస్టిస్ యశ్వంత్ శర్మ సవాల్ చేశారు. ఆయన ఇంట్లో నోట్ల కట్టలు దొరికిన ఘటనలో జస్టిస్ వర్మపై ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. అంతర్జగత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు జడ్జిలతో గతంలో కమిటీని ఏర్పాటు చేశారు. జస్టిస్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని త్రిసభ్య కమిటీ తేల్చి.. ఈ మేరకు సుప్రీంకోర్టుకు నివేదిక అందించింది. అయితే, కమిటీ దర్యాప్తు నివేదికను ఆయన సవాల్ చేశారు. పిటిషన్‌ను తిరస్కరించిన కోర్టు.. జస్టిస్ వర్మ ప్రవర్తన విశ్వాసాన్ని కలిగించదని.. ఆయన పిటిషన్‌ను విచారణకు





పరిగణలోకి తీసుకోకూడదని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో అప్పటి అప్పటి సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పంపిన లేఖ రాజ్యాంగ విరుద్ధం కాదని సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు వచ్చిన సమయంలో పెద్ద మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టలు, సగం కాలిన నోట్లు కనిపించాయి. ఈ ఘటన తర్వాత జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. అంతర్గత దర్యాప్తు కోసం ఆదేశించింది. అయితే, విచారణ కోసం కమిటీని ఏర్పాటు చేసింది. అయితే, ఓ స్టోర్ రూమ్‌లో నోట్ల కట్టలు ఉన్నాయని.. అది న్యాయమూర్తి నివాసంలో భాగమేనని తేల్చింది. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కమిటీ బదిలీకి మించిన చర్యలు తీసుకోవాలని కోరింది. త్రిసభ్య కమిటీ చెల్లుబాటును సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేయగా.. సుప్రీంకోర్టు తిరస్కరించింది.

# సెప్టెంబర్ 9 న ఉపరాష్ట్రపతి ఎన్నిక

- **నోటిఫికేషన్ విడుదల చేసిన ఎలక్షన్ కమిషన్**
- **అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాలు**
- **ఈనెల 21వరకు నామినేషన్ల దాఖలు**
- **22న నామినేషన్ల పరిశీలన**
- **25 వరకు ఉపసంహరణ**
- **సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక**

న్యూఢిల్లీ -ప్రజా స్వేచ్ఛ

ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవి ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఎన్నికల కమిషన్ (ఈసీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీంతో నామినేషన్ ప్రక్రియ గురువారం నుంచే అధికారికంగా మొదలైంది. సెప్టెంబర్ 9న రాష్ట్రపతి ఎన్నిక జరగనున్నదని ఈసీ వివరించింది. అదే రోజు ఓట్ల లెక్కింపు జరిగి, ఫలితాలు విడుదల కానున్నాయని పేర్కొన్నది. ఈసీ విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఆగస్టు 21. ఆగస్టు 22న నామినేషన్ పేపర్ల పరిశీలన(స్క్రుటినీ) ఉంటుంది. నామినేషన్లను ఉపసంహరించుకోవటానికి చివరి తేదీ ఆగస్టు 25. సెప్టెంబర్ 9న ఎన్నికల నిర్వహణ ఉంటుంది. అదే రోజు ఓట్ల లెక్కింపు జరిగి, ఫలితాలు వెలువడుతాయి. ఆరోగ్య కారణాలతో గతనెల 21న జగదీప్ ధన్కర్ రాజీనామాతో ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక అనివార్యమైన విషయం విదితమే. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు మంచి ఆధిక్యం ఉన్నదని రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటారు. రాజ్యసభకు నామినేట్ అయిన సభ్యులు కూడా ఓటు వేయటానికి అర్హులే. 543 మంది సభ్యులుండాల్సిన లోక్‌సభలో ప్రస్తుతం ఒక స్థానం (పశ్చిమ బెంగాల్ నుంచి బసిర్‌హాట్ సీటు) ఖాళీగా ఉన్నది. 245 మంది సభ్యులుండాల్సిన రాజ్యసభలో ప్రస్తుతం ఐదు ఖాళీలు (జమ్మూకాశ్మీర్ నుంచి నాలుగు, పంజాబ్ నుంచి ఒకటి) ఉన్నాయి. దీంతో రెండు సభల సభ్యుల మొత్తం సంఖ్య 786గా ఉన్నది. విజయం సాధించాలంటే మొత్తం 394 మంది సభ్యుల బలం అవసరం ఉంటుం దని రాజకీయ నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యులు ఉన్నారు. ఇక రాజ్యసభలో అధికార కూటమికి 129 మంది సభ్యుల మద్దతు ఉన్నది. దీంతో ఎన్డీఏకు పార్లమెంటు ఉభయ సభల్లో కలుపుకొని మొత్తం 422 మంది సభ్యులు ఉన్నారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# ప్రధాని మోడీతో కమలహాసన్ భేటీ

**న్యూఢిల్లీ,-ప్రజా స్వేచ్ఛ**

ఇటీవల రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేసిన నటుడు కమలహాసన్ ప్రధాని నరేంద్ర మోదీని గురువారం కలిశారు. సంబంధిత ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. సమావేశంలోని ముఖ్యాంశాలు పంచుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తమిళనాడు ప్రజల ప్రతినిధిగా, కళాకారుడిగా ప్రధానికి కొన్ని అంశాలపై విజ్ఞప్తి చేశా. ప్రధానంగా.. కీళడి గురించి చర్చించా. తమిళ నాగరికత, తమిళ భాషను ప్రపంచవ్యాప్తం చేయడంలో ప్రధాని మద్దతు కోరానని తెలిపారు. మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ అధినేత కమల్.. రాజ్యసభ ఎంపీగా జులైలో ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే.



సినిమాల విషయానికొస్తే.. 'థగ్‌లైఫ్'తో ఈ ఏడాది ప్రేక్షకుల ముందుకొచ్చారు.

# పేద ప్రజలకు వైద్యాన్ని చేరువ చేసేందుకు హెల్త్ సెంటర్..

-కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ షాకిర్ సిద్ధికి



**మెట్ పల్లి ప్రజా స్వేచ్ఛ**

పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని చేరువ చేసేందుకు ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్ భవనం ను నిర్మిస్తున్నట్లు రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ షాకిర్ సిద్ధికి అన్నారు. పట్టణంలోని వైయస్సార్ అర్బన్ కాలనీలో ఒక కోటి 43 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను షాకీర్ సిద్ధికి గురువారం పరిశీలించారు. భవన నిర్మాణంలో నాణ్యత పాటించాలని పనులు త్వరగా పూర్తి చేయాలని లేబర్ కు సూచించారు. ఈ భవన నిర్మాణం ద్వారా కాలనీ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని దూర ప్రయాణ భారం తగ్గుతుందని తెలిపారు. వైయస్సార్ అర్బన్ కాలనీలో ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి జీవన్ రెడ్డి లకు షాకీర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నరసయ్య, చంద్రకాంత్, వెంకన్న, సాయిలు, లక్ష్మి లు ఉన్నారు.

# నిబంధనలు బేఖాతరు ,,,, అక్రమ నిర్మాణాల జోరు

-అక్రమ నిర్మాణాలే ఆదాయ మార్గాలు
-కిష్టారెడ్డిపేట్ పరిధిలో వెలుగు చూసిన బాగోతం
-ప్రభుత్వ ఖజానాకు భారీ గండి పురపాలక అధికారిపై రాజకీయ ఒత్తిళ్లు
-బిల్డర్లు బరితెగిస్తున్న వైనం



**ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి**

అమీన్ పూర్ పురపాలక సంఘంలోని కృష్ణారెడ్డి పెట్ వార్డులో అనుమతులకు విరుద్ధంగా బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణం కొనసాగుతుంది భవన నిర్మాణాలు పారదర్శకంగా ఉండాలని ఉద్దేశంతో ప్రభుత్వం పురపాలక చట్టం అమల్లోకితీసుకువచ్చినప్పటికీ అక్రమ కట్టడాలు ఆగడం లేదు నిబంధనలకు పూర్తి విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి అధికారులకు రాజకీయ ఒత్తిళ్లతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి జరుగుతున్న అక్రమ నిర్మాణాల వెనుక కొందరు ప్రజా ప్రతినిధులు ఉన్నారనే ఆరోపణలున్నాయి భవనాల నిర్మాణా అనుమతులకు అనుగుణంగా జరుగుతున్నాయో లేదో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్న సదరు బిల్డర్లు పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు దీంతో అక్రమార్కులు ఇబ్బందులకు తుంగలో తొక్కి గృహాలు వాణిజ్య సముదాయాలను కడుతున్నారు ఇప్పుడు జరుగుతున్న నిర్మాణానికి సెట్ బ్యాక్ లేకుండా నిర్మించేసారు జరుగుతున్న అక్రమ నిర్మాణాల పై సంబంధిత అధికారులు చర్య తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు

# గండేపల్లి మండల తెలుగు రైతు అధ్యక్షులుగా చిట్యాల అప్పారావు




**ప్రజా స్వేచ్ఛ కాకినాడ జిల్లా గండేపల్లి ప్రతినిధి**

గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చిట్యాల అప్పారావును మండల తెలుగు రైతు అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రైతు బాంధవుడు,అపర భగీరథులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మండల రైతు అధ్యక్షుడిగా నన్ను నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మండలంలో రైతులకు ఏ సమస్యలు లేకుండా ప్రభుత్వం,పార్టీకి అనుసంధానంగా పనిచేస్తూ రైతు సహాయ కేంద్రాల నుండి రైతులకు అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావుతో కలిసి టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేస్తామని తెలియజేశారు. అప్పారావుకు కందుల జమ్మి, చిట్యాల బాబ్జి,తంగేళ్ల అప్పారావు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కేసీఆర్ కు ఏర్రవల్లి ఫాంహౌసే చర్లపల్లి జైలు

-కేసీఆర్ ప్రస్తుతం జైల్లోనే ఉన్నారు
-ఫాంహౌసలో తనను బంధించుకున్నారు
-ఎన్నికల్లో ఓడించడమే ఆయనకు పెద్ద శిక్ష
-కేసీఆర్ ఆరోగ్యం జాగ్రత్తని అధికార్లకు చెప్పా
-ఫిరాయింపు తప్పని సుప్రీం తీర్పిస్తే మేం సేఫ్
-65 మంది ఎమ్మెల్యేలు మాతో ఉంటారుగా?
-ఎన్నికల ప్రక్రియలో మోసాలు జరిగేది నిజం
-కొడంగల్‌లోనే 15 వేల ఓట్లు మాయం
-మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**న్యూఢిల్లీ, ప్రజా స్వేచ్ఛ**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కొత్తగా జైల్లో పెట్టాల్సిన పని లేదని, ఆయనకు ఎర్రవల్లి ఫాంహౌసే చర్లపల్లి జైలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన తనను తాను జైల్లో పెట్టుకున్నారని చెప్పారు. గురువారం ఢిల్లీలోని తన అధికార నివాసంలో రేవంత్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "కేసీఆర్ ఫాంహౌసకు, చర్లపల్లి జైలుకు తేడా ఏముంది? అక్కడా పోలీసులు ఉంటారు, ఇక్కడా ఉన్నారు. మధ్య మధ్యలో విజిటర్స్ వచ్చి మాట్లాడి వెళ్తారు. కేసీఆర్‌ను ఓడించడమే పెద్ద శిక్ష. కేసీఆరే కాదు. ఏ రాజకీయ నాయకుడికైనా ఎన్నికల్లో ఓడించడమే అతిపెద్ద శిక్ష. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి నాకు తెలియదు. ప్రతిపక్ష నేత హోదాలో ఉన్నారు కాబట్టి ఆయనకు అనారోగ్య సమస్య తలెత్తితే మంచి వైద్యం అందించాలని ఆరోగ్య సెక్రటరీకి చెప్పా. కాకపోతే మా ఆరోగ్యం గురించి ఎవరికీ చెప్పేది లేదని అంటున్నారు. గతంలో జైపాల్ రెడ్డి ఆరోగ్యం విషయంలో అప్పటి ప్రభుత్వం ఇలానే స్పందించింది. వాజ్‌పేయి విషయంలోనూ ఆనాటి ప్రధాని రాజీవ్‌గాంధీ శ్రద్ధ తీసుకున్నారు. నేను విద్వేష రాజకీయాలు చేయను. నాకా అవసరం లేదు. కేసీఆర్ లాగా బిట్టర్ పాలిటిక్స్ నాకు రావు" అన్నారు. ఈవీఎంల్లో అవకవతకలు, ఓట్ల గల్లంతు అంశాలపైనా రేవంత్ రెడ్డి స్పందించారు. తాను కొడంగల్‌లో పోటీ చేసినప్పుడూ 15 వేల ఓట్లు మాయం చేశారని ఆరోపించారు. ఓటరు లిస్టులో ఓట్లు ఉన్నాయని, బూత్‌లోకి వెళితే మాయమయ్యాయని చెప్పారు. పోలింగ్ బూత్‌కు వెళితే, మరోచోటికి వెళ్లాలని చెబుతారని, అక్కడికి వెళితే మరో చోటికి వెళ్లమని అంటారని, ఇలా తిప్పడం ద్వారా ఓట్లు వేయకుండా చూస్తారని తెలిపారు. కుటుంబంలో ఐదు ఓట్లు ఉంటే రెండు మాయం చేయడం మరో పద్ధతి అన్నారు.

**దుప్పటి కప్పుకొని పడుకొన్నా మాదే అధికారం**

రాష్ట్ర ప్రజలు తమ పరిపాలన పట్ల ఎంతో సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. ఇంట్లో దుప్పటి కప్పుకొని పడుకొన్నా మళ్లీ తమదే అధికారం అని తేల్చిచెప్పారు. ఏ ఎన్నికలు వచ్చినా సునాయసనంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఒకసారి గెలిచిన తర్వాత అందరి ఇళ్లల్లోకి తొంగి చూడాలని, ప్రతి విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తే మళ్లీ గెలవడం కష్టమేనని బీఆర్ఎసను ఉద్దేశించి అన్నారు.

# గణితం సైన్స్ పై భయాన్ని పోగొట్టిన గీతం విద్యార్థులు

## కంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభ్యాస కార్యక్రమాల ఏర్పాటు

**ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి**

లెక్కలు,సైన్స్ అంటే పిల్లల్లో సహజంగా ఉండే భయాన్ని పొగొట్టి,వాటిపై మక్కువను పెంచేలా గీతం విద్యార్థులు కృషి చేశారు.సంగారెడ్డి జిల్లా, కంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం గురువారం అభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం అధ్యాపక సమన్వయకర్తలు డాక్టర్ పి. నరసింహ స్వామి,డాక్టర్ శివారెడ్డి శేరి మార్గదర్శనం, పర్యవేక్షణలో జొన్నాడ విశాల్ భరద్వాజ్,ఆయన బృంద సభ్యులు జంగం విశాల్, సుభాంగి పాండా,అనుష్క ప్రజాపతి,పిర్లమర్ల లక్ష్మీ వజ్రాతో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు పాఠశాల విద్యార్థులకు గణితం,సైన్స్ ను మరింత అందుబాటులోకి తీసుకురావడం, ఆనందించదగినదిగా చేయడంపై ఈ బృందం దృష్టి సారించింది. విద్యార్థుల దృక్పథాలు, భయాలను అర్థం




చేసుకోవడానికి వారితో ముఖాముఖి నిర్వహించి, రోజువారీ జీవితంలో లెక్కలు, సైన్స్ యొక్క ఔచిత్యాన్ని చాటేలా ప్రదర్శనలు,శీఘ్ర గణన పద్ధతులతో కూడిన అభ్యాసాలతో సహా అనేక కార్యకలాపాలను నిర్వహించారు.వీటిలో గుణకార సత్వర మార్గాలు, భాగాహార ఉపాయాలు, భాగహార నియమాలు,అలాగే చతురస్రాలు,వర్గమూలాలు, ఘనాలు,ఘన మూలాలను గణించడానికి చిట్కాలను చెప్పి,విద్యార్థులతో ఆచరింపజేశారు ఇవేగాక, క్విజ్ పోటీతో పాటు ఉల్లాసమైన ప్రశ్నోత్తరాల రౌండ్ నిర్వహించి,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనేలా చేశారు.సాధ్యమైన చోటల్లా ఆచరణాత్మక ప్రదర్శనలను చేర్చి,విద్యార్థులకు దృశ్యమానంగా వివరించారుఈ కార్యక్రమానికి పాఠశాల విద్యార్థుల నుంచి ఉత్సాహభరితమైన స్పందన లభించడమే గాక,విద్యార్థులకు ప్రేరణాత్మక అనుభవంగా నిరూపితమైంది. గణితం,విజ్ఞాన శాస్త్రాన్ని విద్యార్థులు సులువుగా అర్థం చేసుకోవడానికి,వారి మనస్సులలో భయాన్ని పోగొట్టి, వాటిపై మక్కువను పెంచడానికి ఈ కార్యక్రమం దోహదపడింది అనడంలో అతిశయోక్తి లేదు.

# నెల్లిపూడి లోఘనంగా ఆయిల్ ఫామ్ తోటల విస్తరణ మహోత్సవం






**ప్రజా స్వేచ్ఛ కాకినాడజిల్లా శంఖవరం ప్రతినిధి**

ప్రత్తిపాడు నియోజవర్గం శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామశివారుమద్దుకూరిపెద్దకాపు ,శ్రీనివాసరావు గలవ్యవసాయ క్షేత్రంలో గురువారంపతాంజలి ఫుడ్స్ లిమిటెడ్ పెద్దాపురం మరియు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పామాయిల్ రైతులకు ఆయిల్ ఫామ్ విస్తరణ అవగాహన సదస్సుకు పత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభరాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అధికారులతో కలిసిముందుగా ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా పామాయిల్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం మైక్రో ఇరిగేషన్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలోఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ ఈ ప్రాంతరైతులు పామాయిల్ తోట లు వేయడం వలన అధిక లాభాలు పొందవచ్చునని అన్నారు. మరియుకాకినాడ జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జీ.వి. వి. వి. ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పామాయిల్ రైతులకు ప్రభుత్వం నుండి అనేక రాయితీతో పాటుసబ్సిడీతోపాటు మొక్కలు ఉచితంగా రైతులకు అందజేస్తామని వివరించారు.టిడిపి నాయకులు పర్వత సురేష్, బద్ది రామారావు ,వెన్న శివ, జనసేన కన్వీనర్ మేడిశెట్టి బాబీ,అదేట్రా వరహాలుబాబు, శంఖవరం,రౌతులపూడి ఇంచార్జ్ ఉద్యానశాఖ అధికారి కె. దివ్యశ్రీ, పతంజలి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పెద్దాపురం వి.పట్టాభిరామ్,ఏజీఎం డి. రవీంద్ర,రైతు సేవా కేంద్రం సిబ్బంది,ఉద్యాన శాఖ సిబ్బంది,పతంజలి ఫుడ్స్ సిబ్బంది, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ సిబ్బంది అధిక సంఖ్యలో రైతులుతదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల కోసమే రైతు భరోసా ,,, ఎన్నికల తర్వాత ఎత్తివేయడం ఖాయం.

## మెదక్ రైతు ధర్నా లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డీ



ప్రజా స్వేచ్ఛ -వనపర్తి జిల్లా ప్రతినిధి
కోవిడ్ లోనూ వ్యవసాయాన్ని, రైతులను కాపాడిన కెసిఆర్ కృష్ణా,గోదారి జలాలు ఆంధ్రా పాలవుతున్న పట్టించుకొని రేవంత్.బిజెపి తో కాంగ్రెస్ చీకటి స్నేహం రేవంత్ ఆంధ్రపాలకులకు తొత్తు అని, జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వరంలో మెదక్ రైతు ధర్నాలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు కె సి ఆర్ రైతులకు,వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి వ్యవసాయ రంగాన్ని,ఆహార ఉత్పత్తులను దేశంలోనే అగ్రభాగాన నిలిపారని కొనియాడారు.కోవిడ్ సమయములో అన్ని రంగాలు మూతపడిన కె సి ఆర్ దగ్గరవుండి రైతులకు సాగునీరు,24గంటల కరెంట్, యూరియా సరఫరా,రైతు బంధు సకాలములో ఇచ్చి కొనుగోలు పూర్తి చేసి లక్షలాది రైతులతో పాటు ప్రజలను కాపాడుకున్నారని అన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 600 రోజులైనా పాలన గాలికి వదిలి రైతులను బజారున నిలబెట్టారని దుయ్యబట్టారు. రైతు భరోసాను కేవలం ఎన్నికల ఆయుధంగా కాంగ్రెస్ ఉపయోగించుకుంటది అని బోనస్ ఇస్తామని పోయిన వానకాలం,యాసంగికి బోనస్ ఎగ్గొటిందని అన్నారు.అన్ని రకాల వడ్లకు బోనస్ అని చెప్పి ఎన్నికల తర్వాత కేవలం సన్నాలకు మాత్రమే అని రైతులను మోసం చేసిందని ఆయన అన్నారు.ఎన్నికలకు ముందు 47వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి బడ్జెట్లో 31వేల కోట్లు పెట్టీ కేవలం 21వేల కోట్ల రుణమాఫీ చేసి చేతులు దులుపుకొన్నది అని కృష్ణా గోదావరి నది జలాలు ఆంధ్రా పాలవుతున్న,వృథాగా సముద్రం పాలవుతున్న నిర్లక్ష్యం చేస్తూ రేవంత్ ఆంధ్ర పాలకుల ప్రయోజనాలు కాపాడుతున్నారని నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. యూరియా కొరత నివారించలేని ప్రభుత్వం రైతులకు ఏమి మేలు చేస్తుందని ఈ రాష్ట్రంలో సింగిల్ విండో, మార్క ఫెడ్ ద్వారా ఇతర 9వేల సెల్స్ కౌంటర్లు ఉన్నాయని ఎక్కడ కూడా యూరియా లేక చెప్పులు క్యూ లైన్ లో పెట్టే దుస్తితి దాపురించిందని మంత్రి తుమ్మలకు రైతుల మీద ధ్యాసకూడా లేదని వాపోయారు.ప్రజలు హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికలలో బుద్ధి చెబుతారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డీ అన్నారు.

## జూనియర్ కళాశాలలో రాఖీ సంబరాలు



ప్రజా స్వేచ్ఛ బైంసా ప్రతినిధి
పైసా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాఖీ సంబరాలను ముందస్తుగా ప్రారంభించారు, విద్యార్థిని విద్యార్థులు స్నేహభావతో ఒకరికి ఒకరు రాఖీలను కట్టుకొని పండుగ జరుపుకున్నారు, అన్నాచెల్లెళ్ల ప్రేమ అనురాగానికి ప్రతికగా నిలిచే రాఖీ పండుగ అని కళాశాల ప్రిన్సిపల్ శివరంజని అన్నారు, ప్రతి ఒక్కరూ స్నేహభావం పెంపొందించుకొని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు, ఈ కార్యక్రమంలో అజపకులు కదర్ల హరిప్రసాద్, భూషణ్ పాండే, బాలానంద్, సందీప్, సంగీత, రజనీకాంత్, చందన, లావణ్య, రాజారెడ్డి, గంగయ్య, చరణ్ తదితరులు పాల్గొన్నారు,

## కల్లెపు కిష్టయ్య కుటుంబానికి బియ్యం అందజేత



ప్రజా స్వేచ్ఛ ఆలేరు నియోజకవర్గ ప్రతినిధి
అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన కల్లెపు (పుట్టల)కిష్టయ్య కుటుంబానికి గురువారం బీఆర్ఎస్ నాయకులు,మాజీ ఎం పీ టీ సీ రచ్చ రాంనర్సయ్య,తాజా మాజీ ఉపసర్పంచ్ కంతి మహేందర్,లు 50కిలోల బియ్యాన్ని మృతుని భార్య అండాలు,కుమారుడు సాయిరామ్ కు శారాజీపేట గ్రామం లో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు మొరిగాడి అశోక్, సందేపల్లి రాంనర్సయ్య,కళ్లెం తిరుమలేశు,పుట్టల యాదగిరి,జనగాం కిష్టయ్య,చిలుకు ప్రశాంత్, పుట్టల రమేష్,పి.నరేష్,కల్లెపు రవి,జే.పవన్, ఎల్లయ్య,ఐలయ్య,కిష్టయ్య, పెంటయ్య,చంద్రయ్య,శ్రీరామ్, శ్రీకాంత్,సాయి,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన డా.జి.చిన్నారెడ్డి



ప్రజా స్వేచ్ఛ వనపర్తి ప్రతినిధి
సత్తిరెడ్డి,కరుణ కొడుకు వివాహ రిసెప్షన్ వేడుక హిందూ గార్డెన్ లో నిర్వహించిన వేడుకకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.జిల్లెల.చిన్నారెడ్డిహాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన వధూవరులకు లకు అక్షింతలు వేసి నిండు నూరేళ్లు పిల్లా పాపలతో ఉండాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమం లో వనపర్తి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్లా, భాస్కర్,బంధుమిత్రులు పాల్గొన్నారు

## గంగపుత్రులు అన్ని రంగాల్లో ఎదగాలి



ప్రజా స్వేచ్ఛ బైంసా ప్రతినిధి
సాంప్రదాయమైన మత్స్యకార వృత్తిని కొనసాగిస్తున్న గంగపుత్రులు అన్ని రంగాల్లో ఎదగాలని గంగపుత్ర యువ తరంగణి జిల్లా అధ్యక్షులు మోహన్ అన్నారు, బుధవారం బైంసా మండలంలోని కోతలుగా, ఎగ్గామ్, బిజ్జూర్, గ్రామాల్లో నిర్వహించిన చైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు, అనాదిగా గంగపుత్రులు వెనుకబడుతున్నారని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గంగపుత్రుడికి అందే విధంగా పాలకులు చొరవ చూపాలని కోరారు, మత్యకారుల సమస్యల పరిష్కారానికి యువత నడుం బిగించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో గంగపుత్ర యువ తరంగిణి జిల్లా నాయకులు, పొట్టోల్లా రాజేశ్వర్, దొంతుల వార్ పవన్, శివరాత్రి దత్తాద్రి, ఎగ్గం గంగపుత్ర సంఘం అధ్యక్షులు గంగాధర్, రవి, కోతులుగా సంఘం అధ్యక్షులు సత్యనారాయణ మత్స్యకారులు పాల్గొన్నారు,

## ఇందిరమ్మ ఇల్లు బేస్మెంట్ పూర్తి

-1లక్ష రూపాయలు లబ్ధిదారుల అకౌంట్లో జమ
-సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అల్వాల



ప్రజా స్వేచ్ఛ పెద్దమందడి /వనపర్తిజిల్లా ప్రతినిధి
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కట్టుకున్న వారికి ఇండ్లు ఇచ్చారు.మొదటి బేస్మెంట్ బిల్లు1లక్ష రూపాయలు అకౌంట్లో పడినావని పెద్దమందడి మండలం, అల్వాల గ్రామానికి చెందిన, నాగమ్మ w/o కొండన్న కి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయింది బేస్మెంట్ లెవెల్ పూర్తి చేశారు.కావున మొదటి విడతలో వీరికి 1లక్ష రూపాయలు సోమవారం వారి అకౌంట్లోకి జమ అయినవని గ్రామ కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ రెడ్డి తెలిపారు.వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా పాలనలో ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే తూడి మేగారెడ్డికి, కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమం లో నాగరాజు, కురుమూర్తి,తదితరులు పాల్గొన్నారు

## మాతృశ్రీ హైస్కూల్లో ముందస్తు రాఖీ పండుగ వేడుకలు



మెట్ పల్లి ప్రజా స్వేచ్ఛ
పట్టణంలోని గురువారం ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను మాతృశ్రీ హైస్కూల్లో ఘనంగా నిర్వహించామని పాఠశాల కరస్పాండెంట్ ఇందూరి రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భాన్ని ఇట్టి కార్యక్రమాన్ని పురస్కరించుకొని నర్సరీ నుండి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు రాఖీలను కట్టుకోవడం జరిగిందని, రాఖీలు కట్టుకున్న విద్యార్థిని విద్యార్థులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఇట్టి రక్షాబంధన్ (రాఖీ పండగ) ఒక అన్నాచెల్లెళ్లకు అక్క తమ్ముళ్లకు రుణబంధంగా ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మారాణి, ఇంచార్జ్ వినయ్ కుమార్, నీరజ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కళాకారుడు పారుపల్లి నరసింహకు ఘన సన్మానం



ప్రజా స్వేచ్ఛ వలిగొండ
యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో 11వ జాతీయ చేనేత దినోత్సవ సందర్భంగా గురువారం వలిగొండ మండలం ఎం తుర్కపల్లి గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు పారుపల్లి నరసింహకు ఏడి జౌళి సంచాలకులు శ్రీనివాస రావు ఆధ్వర్యంలో కలెక్టరేట్ మందిరంలో చేనేత పాట పాడినందుకు కలెక్టర్ హనుమంతరావు చేతుల మీదుగా నేషనల్ పద్మ అవార్డు గ్రహీత.నేషనల్ మహాకవి నన్నయ్య అవార్డు గ్రహీత పురస్కారం మెమొంటో ప్రశంస పత్రం శాలువతో ఘనంగా సన్మానించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కళాకారుడికి సన్మానం చేయడం అనేది ఒక మంచి సంప్రదాయమని ఇది వారి కృషిని నైపుణ్యాన్ని గుర్తించి గౌరవించడం అవుతుందన్నారు చేనేత కళాకారులను ప్రోత్సహించడానికి వారి కలను కాపాడడానికి ఇలాంటి సన్మానాలు ఎంతో అవసరం అన్నారు ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు


## కేటీఆర్ నీ మర్యాదపూర్వకంగా కలిసిన మరబోయిన రవి యాదవ్



ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి
శేరిలింగంపల్లి నియోజకవర్గం మసీద్ బండ లోని సీనియర్ నాయకుడు మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ నా కుమారుడు మారబోయిన భౌమిక్ యాదవ్ జాతీయ గ్రాప్లింగ్ రెస్లింగ్ ఛాంపియన్షిప్లో స్వర్ణ పతకం,మరియ కుమార్తె మారబోయిన మోక్షిత జాతీయ కరాటే ఛాంపియన్షిప్లో స్వర్ణ పతకం సాధించిన సందర్భంగా,బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) మరియు కుకట్పల్లి ఎమ్మెల్యే మాధవరామ కృష్ణారావు తమ నందీనగర్ నివాసంలో ఈ రోజు ప్రత్యేకంగా ఆశీర్వదించారు. కేటీఆర్ మాట్లాడుతూ ఈ యువ క్రీడాకారుల విజయాలు తెలంగాణ యువతకు ప్రేరణ. వారి క్రీడా వృత్తిని మరింత ఎత్తుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను మాధవరావు ఇద్దరు సోదరులు జాతీయ స్థాయిలో స్వర్ణం సాధించడం తెలంగాణ క్రీడా వికాసానికి నిదర్శనం అని అన్నారు

## సబ్సిడీపై నూలును అందించాలి

ప్రజా స్వేచ్ఛ,చేనేతలకు ఇచ్చిన 25 హామీలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసి, చేనేత సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. చేనేతల సంక్షేమానికి 5 వేల కోట్లు బడ్జెట్లో కేటాయిస్తామని చెప్పిన ప్రధాని మోడి ముష్టి రూ.200 కోట్లు మాత్రమే ఇవ్వడం దారుణమని తెలిపారు. చేనేతలకు సబ్సిడీ కింద బకాయి పడిన రూ.152 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి చేనేతకు హెల్త్ కార్డు అందించాలని, భీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.



# బిజినెస్


## ఉద్యోగులకు టీసీఎస్ తీపి కబురు..

*80 శాతం ఉద్యోగుల వేతనాలు పెంపు*




పెద్ద ఎత్తున ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించి షాకిచ్చిన భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇప్పుడు తీపి కబురు చెప్పింది. దాదాపు 80 శాతం ఉద్యోగుల వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది. టీసీఎస్ తాజా నిర్ణయంతో జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. సెప్టెంబర్ 1 నుంచి వేతన పెంపులను అమలు చేయనున్నట్టు ఉద్యోగులకు పంపిన ఈ మెయిల్‌లో టీసీఎస్ సీహెచ్ఆర్‌వో మిలింద్ లక్కడ్ తెలిపారు.కాగా, ఇటీవలే టీసీఎస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. లేఆఫ్స్ ప్రకటన వేళ కంపెనీ జీతాల పెంపు నిర్ణయం ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశమనే చెప్పాలి.

## ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్.. స్టాక్ మార్కెట్లకు వరుస నష్టాలు..




భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 సుంకాలను విధించిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు నష్టాలను కొనసాగిస్తున్నాయి. ట్రంప్ బెదిరింపుల కారణంగా అంతర్జాతీయంగా కూడా మిశ్రమ సంకేతాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా నష్టాలతో మొదలయ్యాయి. అయితే రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడం కాస్త సానుకూలాంశంగా కనిపిస్తోంది. కాగా, ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల బాటలో ఉన్నాయి . బుధవారం ముగింపు (80, 543)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 300 పాయింట్ల నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాస్త కోలుకుంది. పలు రంగాల్లో మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపుతుండడంతో నష్టాల్లోనే కదలాడుతోంది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 279 పాయింట్ల నష్టంతో 80, 264 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 78 పాయింట్ల నష్టంతో 24, 495 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్‌లో ఫోర్టిస్ హెల్త్, లూపిన్, పిరామిల్ ఫార్మా, గ్రాన్యుయల్స్ ఇండియా, కోఫోర్జ్ లిమిటెడ్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. భెల్, జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్, కంటైనర్ కార్పొరేషన్, భారత్ ఫోర్జ్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాల బాటలో కొనసాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 111 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 184 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 87.71గా ఉంది.

## ఆకాశమే హద్దుగా బంగారం.. చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న ధర

**-రూ.3,600 పెరిగిన తులం విలువ**
**-రూ.1,02,620కి చేరుకున్న ధర**



**న్యూఢిల్లీ,**
బంగారం భగ..భగమండుతున్నది. దేశీయ ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రప్ మరో 25 శాతం సుంకాన్ని విధించనున్నట్టు ప్రకటించడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళన తీవ్రస్థాయికి చేరుకున్నది. దీంతో తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు చుక్కలను అంటుకున్నాయి. దేశ రాజధాని నూఢిల్లీ బులియన్ మార్కెట్లో గురువారం ఒకేరోజు బంగారం ధర రూ.3,600 ఎగబాకింది. ఒకేరోజు ఇంతటి స్థాయిలో పెరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి పదిగ్రాముల పుత్తడి ధర చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,02,620కి చేరుకున్నది. ఈ విషయాన్ని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ తాజాగా వెల్లడించింది. అంతకుముందు ఈ ధర రూ.99,020గా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర అన్ని పన్నులు కలుపుకొని రూ.3,600 ఎగబాకి రూ.1,02,200గా నమోదైంది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం పుత్తడి ధర రూ.220 అందుకొని రూ.1,02,550 పలికింది.

## సిరాజ్‌కు తగినంత గుర్తింపు రాలేదు.. అతడిలో నచ్చే అంశాలివే..!




అండర్సన్– టెండూల్కర్ ట్రోఫీలో నిప్పులు చెరిగిన మహ్మద్ సిరాజ్ ఓవల్‌లో గేమ్ ఛేంజర్ అయ్యాడు. ఐదో రోజు తొలి సెషన్‌లో సంచలన స్పెల్‌తో మూడు వికెట్లు తీసి భారత జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడీ పేస్ గన్. సిరీస్ సమం కావడంలో కీలక పాత్ర పోషించిన సిరాజ్‌పై మాజీలు ప్రశంసలు కురిపిస్తూనే ఉన్నారు. అలుపన్నది ఎరుగని యోధుడిలా ఐదుకు ఐదు టెస్టులాడడమే కాకుండా.. బుమ్రా గైర్హాజరీలో పేస్ దళానికి నాయకత్వం వహించిన మియా భాయ్‌కు తగినంత పేరు రాలేదని సచిన్ టెండూల్కర్ అన్నాడు.ఓవల్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో 'మ్యాచ్ విన్నర్'గా నిలిచిన సిరాజ్ తన బౌలింగ్‌తో దిగ్గజాల మన్ననలు అందుకుంటున్నాడు. అత్యుత్తమ బౌలర్ అంటూ పలువురు కితాబిస్తున్నారు. ఈ నేపథ్యంలో మాస్టర్ బ్లాస్టర్ సైతం దాదాపు ఇదే అభిప్రాయం వ్యక్తం చేశాడు. 'ఐదు టెస్టుల సిరీస్‌లో సిరాజ్ ప్రదర్శన నమ్మశక్యం అనిపించలేదు. చాలా గొప్పగా బౌలింగ్ చేశాడు. అతడి ఆటిట్యూడ్ నాకెంతో నచ్చింది. అతడి పాదాలలో ఉన్న లయ, వేగం చాలా నచ్చాయి. నిలకడగా లైన్ అండ్ లెంగ్త్‌తో ఆఖరి రోజు సిరాజ్ సూపర్ స్పెల్ వేశాడు.సిరీస్‌లో అప్పటికే 1,000కి పైగా బంతులు వేసిన అతడు.. ఐదో రోజు కూడా గంటకు 145 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడని కామెంటేటర్లు చెప్పగా విన్నాను. అతడి ధైర్యం, జట్టును గెలిపించాలనే అతడి కసి అద్భుతం. జట్టుకు అవసరమైన ప్రతిసారి సిరాజ్ నేనున్నానంటూ ముందుకొస్తాడు. కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ కెప్టెన్ బౌలర్ అనిపించుకుంటాడు. గతంలో చేసినట్టే ఈ సిరీస్‌లోనూ ఈ పేస్ గన్ తన సత్తా చాటాడు. సిరీస్‌లో అతడు తీసిన వికెట్లే అందుకు నిదర్శనం. ఎంతో ప్రతిభ ఉన్నా సరే సిరాజ్‌కు మాత్రం తగినంత గుర్తింపు రాలేదు. అని టెండూల్కర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు.

# స్పోర్ట్స్


## ఎప్పటికీ ఎల్లో జెర్సీలోనే ఆడుతా




**హైదరాబాద్**
చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయర్ ఎంస్ ధోనీ. ఆ జట్టుతోనే భవిష్యత్తులో కొనసాగనున్నాడు. ఇటీవల జరిగిన ఓ ఈవెంట్‌లో అతను ఆ క్లారిటీ ఇచ్చాడు. 2008 నుంచి ఐపీఎల్‌లో చెన్నై టీమ్‌తోనే ధోనీ ఆడుతున్నాడు. అతని సారథ్యంలో ఆ జట్టు అయిదుసార్లు టైటిల్ కూడా నెగ్గింది. అయితే గత కొన్ని సీజన్ల నుంచి సీఎస్కే జట్టు సరిగా పర్ఫార్మ్ చేయడం లేదు. దీంతో ధోనీ కెప్టెన్సీ సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. చివరి సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ .. సీఎస్కే కెప్టెన్‌గా బాధ్యలు చేపట్టాడు. ధోనీ కెరీర్ ముగిసిందా అన్న అనుమానాలకు అతనే తెరదింపాడు.మళ్లీ పసుపు రంగు జెర్సీలోనే ఐపీఎల్ ఆడుతారా అని అడిగిన ప్రశ్నకు ఎంస్ ధోనీ సమాధానం ఇచ్చారు. తన నిర్ణయం తాను తీసుకునేందుకు చాలా సమయం ఉందని, ఎప్పుడూ ఎల్లో జెర్సీలోనే ఆడుతానన్నాడు. క్రికెట్ ఆడినా, ఆడకపోయినా.. తన జర్నీ ఎల్లో జెర్సీలోనే కొనసాగుతుందన్నాడు. నేను, సీఎస్కే ఒకే దగ్గర ఉన్నామన్నారు.చెన్నై జట్టుతో రిలేషన్ పెరిగిందని, ఓ వ్యక్తిగా ఎదగడానికి ఆ అనుభం ఎంతో సహకరించిందని, క్రికెటర్‌గా చాలా ఇంప్రూవ్ అయ్యానని, చెన్నైకి ఇది మంచిదే అని, తనకు కూడా వ్యక్తిగతంగా మంచిదే అని ధోనీ పేర్కొన్నాడు. 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో చెన్నై జట్టు చివరి స్థానంలో నిలిచింది.

## సెప్టెంబర్‌లో భారత్‌కు ఆసీస్ కుర్రాళ్లు..

**పద్నాలుగు మందిలో ఆ ముగ్గురు..!**



క్రికెట్ అభిమానులతో అలరారే భారత గడ్డపై ఆడేందుకు ఆస్ట్రేలియా కుర్ర జట్టు సన్నద్ధమవుతోంది. ఉపఖండం పరిస్థితులను ఆకలింపు చేసుకునేందుకు భావి ఆసీస్ తారలు సెప్టెంబర్‌లో ఇండియా రాబోతున్నారు. భారత 'ఏ' జట్టుతో కంగారూ 'ఏ' జట్టు నాలుగు రోజుల, వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్‌కు నెల రోజుల సమయం మాత్రమే ఉండడంతో గురువారం ఆ దేశ సెలెక్టర్లు పద్నాలుగు మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో ఆడిన నాథన్ మెక్ స్వీనే, సామ్ కొన్‌స్టాస్‌లతో పాటు స్పిన్నర్ టాడ్ మర్ఫీ కూడా ఈ బృందంలో ఉన్నాడు.'భారత ఉపఖండం క్రికెటర్లకు అనేక సవాళ్లు విసురుతుంది. ఎన్నో అవకాశాలను అందిస్తుంది. ఆటగాళ్లు తమ నైపుణ్యాలకు సానబెట్టుకునేందుకు ఎంతో పనికొస్తుంది. అలాంటి వాతావరణంలో ఆడడం వల్ల కుర్రాళ్లు చాలా విషయాలు నేర్చుకుంటారు. ఇలాంటి సిరీస్‌ల ద్వారా భవిష్యత్‌లో ఉపఖండం పర్యటనకు వాళ్లు పకడ్బందీగా సిద్ధం కాగలరు' అని చీఫ్ సెలెక్టర్ జార్జ్ బెయిలీ అన్నాడు. భారత్ ఏ, ఆస్ట్రేలియా ఏ జట్లు సెప్టెంబర్ నుంచి అక్టోబర్ వరకూ తలపడుతాయి. ఇరు జట్ల మధ్య లక్నో వేదికగా సెప్టెంబర్ 16న తొలి మ్యాచ్‌తో సిరీస్ ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 23–26న కూడా ఇదే మైదానంలో నాలుగు రోజుల మ్యాచ్‌లు ఉంటాయి. అనంతరం మూడు వన్డే మ్యాచుల్లో కుర్రాళ్ల సైన్యం అమీతుమీ తేల్చుకోనుంది. కాన్పూర్‌లో సెప్టెంబర్ 30న, అక్టోబర్ 3న, అక్టోబర్ 5న వన్డే మ్యాచుల్లో ఆతిథ్య జట్టును ఆసీస్ ఏ ఢీకొడుతుంది.

**ఆస్ట్రేలియా ఏ నాలుగు రోజుల మ్యాచ్‌ల స్క్వాడ్ :** గ్జావియర్ బార్ట్‌లెట్, కూపర్ కొన్నొలి, జాక్ ఎడ్వర్డ్స్, అరోన్ హార్డీ, క్యాంప్‌బెల్ కెల్లవే, సామ్ కొన్‌స్టాస్, నాథన్ మెక్‌స్వీనే, లాన్సే మోరిస్, టాడ్ మర్ఫీ, ఫెర్గూస్ ఓనీల్, ఒలివర్ పీకే, జోష్ ఫిలిప్, కొరే రిచిసిలో, లియాం స్కాట్.

**ఆస్ట్రేలియా ఏ వన్డే స్క్వాడ్ :** కూపర్ కొన్నొలి, హ్యారీ డిక్సన్, జాక్ ఎడ్వర్డ్స్, సామ్ ఎలాయిట్, జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, అరోన్ హార్డీ, మెకెంజీ హార్వే, టాడ్ మర్ఫీ, తన్వీర్ సంగా, లియాం స్కాట్, లచీ షా, టామ్ స్ట్రేకర్, విల్ సథర్‌లాండ్, కల్లమ్ విడ్లర్.




## బెల్లంకొండ 'కిష్కిందపురి' నుంచి తొలి పాట విడుదల

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'కిష్కిందపురి' . ఈ సినిమాకు కౌశిక్ పెగళ్ళపాటి దర్శకత్వం వహిస్తుండగా.. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. ఉండిపోవే నాతోనే అంటూ సాగే ఈ పాటను జావేద్ అలీ పాడగా.. పూర్ణ చారి లిరిక్స్ అందించారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందించాడు.

## చిల్ మూడ్‌లో రష్మిక..

### విరుపులతో కుర్రాళ్లను ఆగం చేస్తున్న బ్యూటీ!

అందాల ముద్దుగుమ్మ రష్మిక మందన గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఛలో సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగు పెట్టిన ఈ చిన్నది, ఈ మూవీలో తన నటనతో మంచి ఫేమ్ సంపాదించుకుని, తర్వాత వరస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయింది.ముఖ్యంగా ఛలో సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకొని, గీతా గోవిందం సినిమాతో మంచి యూత్‌లో క్రేజ్ సంపాదించుకుంది. ఈ మూవీ తర్వాత ఈ అమ్మడును అవకాశాలు వరించాయి. వరసగా స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ కొట్టేసింది. ముఖ్యంగా పుష్ప సినిమాతో పాన్ ఇండియా లెవల్?లో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది.పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా ఇలా ఈ అమ్మడు చేసిన సినిమాలన్నీ బ్లాక్ బస్టర్ హిట్స్ అవ్వడంతో లక్కీ హీరోయిన్‌గా మారిపోయింది. ఇక ఈ మధ్య రిలీజైన సికిందర్ ఫ్లాప్ అయినప్పటికీ ఈ అమ్మడు క్రేజ్ మాత్రం ఏ మాత్రం దగ్గలేదు. ప్రస్తుతం ఈ చిన్నది రష్మిక ది గర్ల్‌ఫ్రెండ్, రెయిన్బోది సినిమాల్లో నటిస్తుంది.ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది తన క్యూట్ క్యూట్ ఫొటోస్ షేర్ చేస్తూ..కుర్రకారు మనసు దోచేస్తుంది.ఈ క్రమంలోనే ఈ బ్యూటీ తాజాగా తన సోషల్ మీడియా అకౌంట్‌లో బ్లాక్ అండ వైట్ డ్రెస్‌లో ఉన్న పలు ఫొటోలు షేర్ చేసింది. అందులో రష్మిక చాలా క్యూట్ గా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట తెగ వైరల్



## ధనుష్‌తో మృణాల్ ప్రేమాయణం?

దక్షిణాది అగ్రనటుడు ధనుష్‌తో మృణాల్ ఠాకూర్ ప్రేమలో ఉందనే వార్తలు ప్రస్తుతం ముంబయి సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. వీరిద్దరి డేటింగ్‌పై ఆంగ్ల మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ జంట ప్రేమబంధానికి కొద్ది మాసాల క్రితమే బీజం పడిందని అంటున్నారు. ఇటీవల జరిగిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ధనుష్ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మృణాల్‌తో చనువుగా ఉన్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. కొన్ని నెలల క్రితం చెన్నైలో జరిగిన ఓ సినిమా ఈవెంట్‌లో ధనుష్, మృణాల్ మధ్య తొలిసారి పరిచయం ఏర్పడిందని, అక్కడే వీరి ప్రేమప్రయాణానికి తొలి అడుగులు పడ్డాయని అంటున్నారు. ధనుష్ సోదరీమణులు కార్తీక, విమల గీత ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఠాకూర్‌ను ఫాలో కావడంతో డేటింగ్ వార్తలకు మరింత బలం చేకూరినట్లయింది.ధనుష్ తన కుటుంబ సభ్యులకు మృణాల్ ఠాకూర్‌ను పరిచయం చేశారని అంగ్ల మీడియాలో వార్తలొచ్చాయి. తమ ప్రేమబంధంపై ప్రస్తుతం ఈ జంట గోప్యతను పాటిస్తున్నారని, సరైన సమయంలో అందరికి తెలియపరిచే ఆలోచనలో ఉన్నారని సమాచారం.గత కొద్దిరోజులుగా మీడియాలో వస్తున్న డేటింగ్ వార్తలపై ఈ తారలిద్దరూ ఇప్పటివరకూ స్పందించలేదు. దాంతో డేటింగ్ రూమర్స్ నిజమేనని అభిమానులు భావిస్తున్నారు.



## 2028కి కూడా పుష్ప3 రావడం కష్టమే.. కారణం ఏంటంటే..!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, లెక్కల మాస్టారు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం పుష్ప. తొలి పార్ట్ 2021లో రిలీజైంది. ఏ మాత్రం అంచనాలు లేకుండా రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు రాబట్టింది. ఇందులోని పాటలు, డైలాగులు, యాక్షన్ సీక్వెన్స్ లు పాన్ వరల్డ్ రేంజ్ లో ఫేమస్ కావడంతో పుష్ప2 చిత్రానికి క్రేజ్ పెరిగింది. ఇక ఈ మూవీ గత ఏడాది విడుదలై ఇండియన్ సినిమా బాక్సాఫీస్ రికార్డులు కొల్లగొట్టింది. ఏకంగా రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇక పుష్ప 2 సినిమా ఎండింగ్ లో పుష్ప 3 కూడా ఉంటుందని చిన్న హింట్ ఇచ్చారు మేకర్స్. 2028లో పుష్ప 3 సినిమాను విడుదల చేస్తామని రాబిన్ హుడ్ ప్రమోషన్లలో భాగంగా మైత్రి మూవీస్ నిర్మాత రవిశంకర్ చెప్పుకొచ్చారు.అయితే బన్నీ, సుకుమార్ బిజీ షెడ్యూల్ చూస్తే పుష్ప 3 చిత్రం 2028కి రావడం డౌటే అనిపిస్తుంది. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీతో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా పూర్తి కావాలంటే ఎలా లేదన్నా రెండేళ్లు పైన పడుతుంది. అట్లీ సినిమా పూర్తయ్యాక బన్నీ.. త్రివిక్రమ్‌తో ఓ ప్రాజెక్ట్ చేయనున్నాడు. ఈ చిత్రం చేస్తే పుష్ప 3 అనుకున్న టైమ్‌కి రావడం కష్టం. అట్లీ సినిమానే దాదాపు 2027 దాకా చేసేలా కనిపిస్తుంది. ఇక త్రివిక్రమ్ చిత్రం ఎంత లేదన్న ఏడాదిన్నర సమయం తీసుకుంటుంది. మరి పుష్ప 3 ఎప్పుడు సెట్స్ మీదకు వెళుతుంది, ఎప్పుడు పూర్తై థియేటర్స్‌లోకి వస్తుంది. చూస్తుంటే 2028 లో పుష్ప 3 సాధ్యం కాదు సరికదా అసలు అప్పటికి సెట్స్ మీదకు వెళ్లడం గొప్పే అంటున్నారు.అయితే పుష్ప2 భారీ విజయం సాధించిన నేపథ్యంలో పుష్ప 3 కోసం అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పుష్ప రాజ్ మేనియాని మరోసారి తెర మీద చూసేందుకు ఫ్యాన్స్ ఉవ్విళ్లూరుతున్నారు. కాని బన్నీ కమిటైన సినిమాలని బట్టి చూస్తుంటే 2028లో పుష్ప3 రావడం కష్టమే అని తెలుస్తుంది. ఇక సుకుమార్ పుష్ప2 తర్వాత ఏ ప్రాజెక్ట్ స్టార్ట్ చేయలేదు. రామ్ చరణ్‌తో తన తదుపరి మూవీ చేయనున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుతం చరణ్.. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది చేస్తున్నాడు. ఇది పూర్తయ్యాక సుకుమార్- రామ్ చరణ్ కాంబో ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది.

## వార్ 2' ప్రమోషన్

### ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకున్న హృతిక్ రోషన్, ఎన్టీఆర్.!

బాలీవుడ్ అగ్ర నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'వార్ 2ః . ఈ చిత్రం మరో వారం రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. ఇండిపెండెన్స్ డే కానుకగా ఈ చిత్రం ఆగష్టు 14న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ క్రమంలోనే వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు ఈ స్టార్ హీరోలు. అయితే తాజాగా ఈ నటులు ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకున్నారు.జూనియర్ ఎన్టీఆర్ 'వార్ 2' సినిమాలో తన పోస్టర్‌తో ఉన్న ఒక భారీ బిల్ బోర్డ్‌ను హృతిక్ రోషన్ ఇంటికి పంపించి సవాళు "ఘుంగ్రూ టూట్ జాయేంగే పర్ హమ్‌సే యే వార్ జీత్ నహీ పావోగే" (గుంఘ్రూలు పగిలిపోవచ్చు, కానీ ఈ యుద్ధాన్ని మీరు మాతో గెలవలేరు) అంటూ హృతిక్‌ని సవాలు చేశాడు. దీనికి హృతిక్ సమాధానమిస్తూ.. జూనియర్ ఎన్టీఆర్ ఇంటికి హృతిక్ పోస్టర్ ఉన్న ఒక బిల్ బోర్డ్‌ను పంపారు. ఈ బిల్ బోర్డ్‌లో మీరు 'నాటు నాటు' డాన్స్ ఎంత చేసినా, ఈ యుద్ధంలో గెలిచేది మాత్రం నేనే అంటూ హృతిక్ బదులిచ్చాడు. దీనికి ఎన్టీఆర్ బదులిస్తూ.. నైస్ రిటర్న్ గిఫ్ట్ హృతిక్ సర్ అంటూ సరధాగా సమాధానమిచ్చాడు. ఈ ఇద్దరు స్టార్ హీరోల మధ్య జరుగుతున్న ఈ సరదా సంభాషణ 'వార్ 2' చిత్రంపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది.







Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492